జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 09 సెప్టెంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 186 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 08:53:17 వరకు నక్షత్రంరేవతి - 27:24:42 వరకు కరణంవిష్టి - 08:53:17 వరకు, బవ - 20:21:24 వరకు పక్షంకృష్ణ యోగంగణ్డ - 25:50:48 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## 11న మోదీ, పుతిన్ భేటీ!

కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగే అవకాశం

ఉక్రెయిన్ యుద్ధంపైనా చర్చించే చాన్స్

ఇరువురి భేటీపై సర్వత్రా ఆసక్తి!?

న్యూఢిల్లీ,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): ప్రపంచ దేశాల చూపు మరోసారి భారత్, రష్యాల వైపు మళ్లింది. అంతర్జాతీయ రాజకీయాన్ని తీవ్రంగా ప్రభావితం

మిగతా 2లో..

## ప్రధాని పర్యటనలో తుపాకీ కలకలం

పీఎంవో అధికారినంటూ ఎంట్రీకి యత్నం

ముంబై,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ ( లో భద్రతా కలకలం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ పాల్గొననున్న కార్యక్రమం జరిగే ప్రాంతంలో ఇద్దరు అనుమాని తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తాను ప్రధానమంత్రి కార్యాలయం అధికారినని చెప్పుకున్నట్లు సమాచారం. అతని వద్ద నకిలీ గుర్తింపు

మిగతా 2లో..

# కేసీఆర్ హత్యకు కుట్ర..



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి నివాసం ముట్టడికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బయలుదేరడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమాచారం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అసెంబ్లీ నుంచి ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి పయనమయ్యారు. కేసీఆర్‌కు మద్దతుగా, ఆయనకు రక్షణగా వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను బొల్లారం చౌరస్తా వద్ద పోలీసులు భారీగా మోహరించి అడ్డుకున్నారు. కేటీఆర్‌ను బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించగా, హరీష్ రావును జవహర్ నగర్ పీఎస్‌కు తరలించారు. అరెస్ట్ విషయం తెలియడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బోయిన్‌పల్లి పీఎస్‌కు తరలివస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే పద్మారావు ఆ పీఎస్‌కు చేరుకున్నారు. ఎర్రవల్లి ఫాం హౌస్ పై దాడికి యత్నిస్తున్న కాంగ్రెస్ నాయకులను స్వేచ్ఛగా వదిలేసి, రక్షణగా వెళ్తున్న తమను మాత్రమే పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు మార్గాన్ని దిగ్బంధించడంతో కేటీఆర్, హరీశ్‌రావుల నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా బయలుదేరారు. దీంతో అక్కడ తీవ్ర ఘర్షణ వాతావరణం, తోపులాటలు చోటుచేసుకున్నాయి.

- కేసీఆర్‌కు రక్షణ కల్పించాలి
- ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే..
- కేటీఆర్ సంచలన ఆరోపణలు
- కేసీఆర్‌కు భద్రతపై పోలీసులపై నమ్మకం లేదు
- మన నాయకుడు కేసీఆర్ ను మనమే కాపాడుకోవాలి
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్తుండగా కేటీఆర్ అరెస్ట్
- హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతల అరెస్టులు
- బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద రణరంగం..
- రాళ్లు, కుర్చీలతో బీఆర్ఎస్, కాంగ్రెస్ దాడులు
- కేసీఆర్ ఫాంహౌస్ వద్ద 144 సెక్షన్ విధింపు..
- ఫాంహౌస్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు

ఎర్రవల్లి,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. కాంగ్రెస్ నేతలు డప్పులతో ఎర్రవల్లి ఫాంహౌజ్ ముట్టడించడానికి ప్రయత్నించిన సందర్భంగా.. కేసీఆర్‌ను పరామర్శించేందుకు, ఆయనకు రక్షణగా ఎర్రవల్లికి బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు.. హకీంపేట వద్ద అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సంచలన ఆరోపణలకు తెరతీశారు. కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్‌పై కుట్రపూరితంగా హత్యాయత్నానికి పాల్పడ్డాయని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌కు వెళ్తున్న సమయంలో పోలీసులు కేటీఆర్‌ను అదుపులోకి తీసుకుని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని ఆరోపించారు. కేసీఆర్ ఫాంహౌజ్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. అదే సమయంలో తమ సొంత నాయకుడి నివాసానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. దీనిపై డీజీపీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మిగతా 2లో..

మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడిపై

# చర్యలేవి?

- వారికి జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుంది
- దాడిపై అసెంబ్లీలో ప్రశ్నించిన హరీష్ రావు
- నీ తల్లికి కాదు మా అమ్మకు అవమానం జరిగింది
- ఘాటుగా బదులిచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్
- దాడిపై వెనక్కి తగ్గని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్
- వాగ్వాదంతో సభలో నెలకొన్న గందరగోళం..
- సభ నుంచి తప్పుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్





హైదరాబాద్,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ వద్ద జరిగిన అమానుష ఘటనపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుందని హరీష్ రావు అన్నారు. అయితే అవమానం జరిగింది నీ తల్లికి కాదు, మా అమ్మకు అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడిలో పోలీసులపై చర్యలను మంత్రి శ్రీధర్ బాబు పరిశీలిస్తామని అన్నారు. సబితక్క గొంతునొక్కారు, మగ పోలీసులు ఈ పని చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంటే.. దీనిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డిని చీర లాగి అవమానిస్తే.. ఆ పోలీసులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా వీరిపైనే కేసులు నమోదు చేసి వేధించడం ఏంటని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాల్సిందిపోయి, వారిపై కేసులు నమోదు చేసి వేధించడంపై హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, ఇది గౌరవసభ కాదని, కౌరవ సభగా మారిందంటూ మండిపడ్డారు. ఆనాడు కౌరవులకు పట్టిన గతే మీకు పడుతుందని, ఈ విషయాలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

మిగతా 12లో..

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లు సస్పెన్షన్

- సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు
- ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం
- తెలంగాణ మండలిలో హైటెన్షన్..
- ఎమ్మెల్సీ తాతా మధును లాక్కెళ్లిన మార్షల్స్

హైదరాబాద్,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని

మిగతా 2లో..




## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు ఊరట

- రిమాండ్ పిటిషన్ తిరస్కరణ
- ఉదయం తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి అరెస్ట్
- నారాయణ గూడ పోలీస్ స్టేషన్ కు తరలింపు

హైదరాబాద్,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో భారీ ఊరట లభించింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పాటు విధుల్లో ఉన్న పోలీసులతో

మిగతా 12లో..



హర్మూజ్‌లో మరోసారి

## రణరంగం..

అమెరికా యుద్ధనౌకలపై ఇరాన్ దాడులు!

మరింత విరుచుకుపడిన అమెరికా దళాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం మరింత తీవ్రరూపం దాల్చింది. పర్షియన్ గల్ఫ్‌లోని కీలకమైన హోర్ముజ్ జలసంధి కేంద్రంగా ఇరు దేశాలు మరోసారి పరస్పర దాడులకు తెగబడ్డాయి. అమెరికాకు చెందిన రెండు యుద్ధం నౌకలపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ( బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ చమురు ట్యాంకర్లను అడ్డుకుంటున్నందుకే ఈ ప్రతిదాడి చేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది. ఈ దాడుల్లో అమెరికా

మిగతా 12లో..

## త్వరలో బుల్లెట్ ట్రైన్ ట్రయల్స్

- వచ్చే ఏడాది మే-జూన్‌లో ప్రారంభం
- వికసిత్ భారత్ కి అనుగుణంగా ముందుకు
- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కీలక దశకు చేరుకుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి బుల్లెట్ ట్రైన్‌ను పట్టాలపైకి తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షల దశ పూర్తయిన 2 నుంచి 4 నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా

మిగతా 2లో..



## భద్రాద్రి విమానాశ్రయానికి ముందడుగు

- స్థలాలను పరిశీలించిన ఏఏఐ బృందం
- నిర్మాణానికి అనువైన ప్రాంతాల పరిశీలన

భద్రాద్రి కొత్తగూడెం,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదిత స్థలాలను ఏఏఐ మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం పరిశీలించింది. రన్‌వే, విమానాల అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్‌పై సాంకేతిక అధ్యయనం చేసింది. రేపు కూడా ఈ బృందం జిల్లాలో పర్యటిస్తుంది. భద్రాద్రి జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు చేరుకుంది. సుజాతనగర్ మండలంలోని సీతంపేటలో బృందం పర్యటించి క్షేత్ర స్థాయి పరిశీలన జరిపింది. ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి,

మిగతా 2లో..

త్వరలో 24 గంటలూ

## బస్ సర్వీసులు

- హైదరాబాద్ లో నడిపేందుకు ఆర్టీసి సిద్ధం
- ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది
- త్వరలో పూర్తిస్థాయిలో సర్వీసులు ప్రారంభిస్తాం
- తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): హైదరాబాద్ మహానగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. 2010 నాటి జనాభా లెక్కలు, ఓటర్ల సంఖ్యను ఆధారంగా హైదరాబాద్ పరిధిలో 1.34 కోట్ల మంది ఉంటారని అంచనా.. ఇతర రాష్ట్రాల నుంచి భాగ్య నగరానికి ఉపాధి, ఉద్యోగాల కోసం నిత్యం వేలాదిమంది వస్తుంటారు. అందువల్ల హైదరాబాద్ మహా నగరం జనాభా గణనీయంగా పెరుగుతోంది. సిటీలో సాఫ్ట్ వేర్, ఫార్మసీ రంగాలతో పాటు ఇతర రంగాల్లో ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం పొద్దున నుంచి అర్ధరాత్రి వరకూ నగర వాసులు ప్రయాణం చేస్తూనే ఉంటారు. అయితే వారి ప్రయాణానికి

మిగతా 12లో..



# సంపాదకీయం

## పెరుగుతున్న సైబర్ మోసాలు

నేటి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎదో ఒకచోట ఎదో ఒక రకంగా వినియోగదారులు, ప్రజలు సైబర్ దాడులకు గురై మోసపోతూనే ఉన్నారు. తాజాగా.. మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు మోసగాళ్లు ఇతరుల పోస్టులపై కావాలనే తప్పుడు కాపీరైట్ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. పదేపదే ఇలాంటి ఫిర్యాదులు వస్తే తమ ఖాతాలు శాశ్వతంగా బ్లాక్ అవుతాయనే భయంతో యూజర్లు వాళ్లు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. 15 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్ యూజర్, తన ఖాతాను కాపాడుకోవడానికి ఒక మోసగాడికి 50 డాలర్లు (రూ. 4700) చెల్లించినట్లు బీబీసీకి తెలిపారు. మెటా అప్పీల్ ప్రక్రియకు వారాల సమయం పడుతుందని, ఆ ప్రాసెస్‌లో వెళ్తే తనకు గతంలో వేల రూపాయల ఆదాయం పోయిందని ఆయన అన్నారు. "ఈ పరిస్థితి బాధితులకు ఎంత ఇబ్బందిగా ఉంటుందో మాకు అర్థమవుతోంది, ఇలాంటివి జరగకుండా నిరోధించేలానే మా వ్యవస్థలను తీర్చిదిద్దాం" అని మెటా ప్రతినిధి వివరించారు. "మా విచారణ తర్వాత, సదరు కంటెంట్‌ను మళ్లీ యథాస్థితికి తెచ్చాం. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఖాతాలకు అదనపు భద్రతను కూడా కల్పించాం" అని తెలిపారు. కానీ, ఏది నిజమైన ఫిర్యాదో, ఏది నకిలీదో గుర్తించడంలో మెటా పనితీరు పేలవంగా ఉందని క్రియేటర్లు అంటున్నారు. నెలవారీ ఫీజు చెల్లించే క్రియేటర్ల అప్పీళ్లకు తప్ప, సాధారణ యూజర్ల ఫిర్యాదులకు సంస్థ త్వరగా స్పందించడం లేదని వారు బీబీసీతో చెప్పారు. 'లాస్ట్ ఇన్ టైమ్ హిస్టరీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ పాత చారిత్రక చిత్రాలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. దీనికి 15 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. దీనిని నడిపే ఓలి ( పూర్తి పేరు చెప్పడానికి ఇష్టపడలేదు), తాను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న చిత్రాలను లేదా హక్కుదారుల అనుమతి ఉన్నవాటినే పోస్ట్ చేస్తున్నట్లు బీబీసీకి చెప్పారు. అయినా సరే, ఈ ఏడాదిలో అతనికి ఇప్పటివరకు డజన్ల కొద్దీ "స్పష్టంగా నకిలీ" కాపీరైట్ ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే మెటా వాటి వాస్తవాన్ని చెక్ చేయదు. కాబట్టి ఎవరి ఖాతాపైనైనా ఇలా వరుసగా ఫిర్యాదులు వస్తే వాళ్ల అకౌంట్ తాత్కాలికంగా ఆగిపోతుంది. ఒకే ఈమెయిల్ ఐడీ నుంచి ఒకేసారి తన పలు పోస్టులపై కాపీరైట్ స్ట్రైక్స్ వస్తున్నాయని ఓలి చెప్పారు. ఆ తర్వాత ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తి, టెలిగ్రామ్ లాంటి ప్రైవేట్ మెసేజింగ్ యాప్‌లోకి రమ్మని మెసేజ్ చేస్తాడు. "వాళ్లు కొంత డబ్బు డిమాండ్ చేస్తారు" అని ఓలి తెలిపారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటే సాధారణంగా కొన్ని వందల డాలర్లు అడుగుతారని చెప్పారు. డబ్బు అడగడం లేదా భవిష్యత్తులో మరిన్ని కాపీరైట్ ఫిర్యాదులు చేస్తామని బెదిరించడం లాంటి మెసేజ్‌లను బీబీసీ కూడా పరిశీలించింది. ఇన్‌స్టాగ్రామ్ తాత్కాలికంగా ఆపేసిన తన అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడానికి ఓలి చివరికి ఒక మోసగాడికి క్రిప్టోకరెన్సీ రూపంలో 50 డాలర్లు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇలా డబ్బులు ఇస్తే నేరగాళ్లను ప్రోత్సహించినట్లే అవుతుందని, కాబట్టి డబ్బులు ఇవ్వొద్దని పోలీసులు బాధితులకు సూచిస్తున్నారు. మెటాను సంప్రదించి ఖాతాను వెనక్కి తెచ్చుకోవాలంటే వారాల కొద్దీ సమయం పడుతుంది కాబట్టి, వేగంగా పనైపోతుందనే ఉద్దేశంతోనే తాను "చివరి ప్రయత్నంగా" డబ్బు కట్టానని ఓలి అన్నారు. కానీ డబ్బు ఇచ్చిన వెంటనే మళ్లీ అతనికి కాపీరైట్ స్ట్రైక్స్ పడ్డాయి. "అదే అత్యంత బాధాకరమైన విషయం" అన్నారు ఓలి. "మనల్ని అంతలా టార్చర్ చేసినవాళ్లకే డబ్బులు సమర్పించుకోవడం, ఆ వెంటనే మళ్లీ వాళ్లు అదే పని చేయడం మనకు ఎంతో నరకంగా అనిపిస్తుంది" అన్నారు. కాపీరైట్ దావాలు ఎక్కువగా రావడంతో ఓలి ఖాతాకు మానిటైజేషన్ ఆగిపోయింది. అంటే, అతని పోస్టులు ఎంత వైరల్ అయినా ఇన్‌స్టాగ్రామ్ నుంచి అతనికి నయాపైసా రాదు. "ఇది వేధింపులా కాదా అని తెలుసుకోవడానికి లేదా అసలు ఏం జరుగుతుందో కనిపెట్టడానికి (మెటా నుంచి) వ్యవస్థలో కనీస విచారణ కూడా జరగడం లేదు" అని ఓలి అన్నారు. చాలా మంది ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా ఇలాంటి అనుభవాలనే పంచుకున్నారు. "క్రియేటర్ల కోసమే తాము ఉన్నామని మెటా పైకి చెబుతున్నప్పటికీ, ఈ ప్రాసెస్‌లో వాళ్లు కనీస సాయం కూడా చేయలేదు. పైగా కస్టమర్ సపోర్ట్ కోసం డబ్బులు కట్టమంటారు" అని 'మోర్బిడ్ క్యూరియాసిటీ' పేజీని రన్ చేస్తున్న అభిన్ టామ్ సెబాస్టియన్ అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'బ్లూ టిక్' (వెరిఫైడ్) కావడానికి మెటా నెలవారీ ఫీజు వసూలు చేస్తుంది, దీనివల్ల లైవ్ చాట్ ద్వారా 24 గంటలూ కస్టమర్ సపోర్ట్ దొరుకుతుంది. "నాకు రావాల్సిన అత్యంత కీలకమైన బ్రాండ్ కాంట్రాక్టులు వేరే క్రియేటర్ చేతికి వెళ్లిపోవడంతో నేను కోలుకోలేని దెబ్బ తిన్నాను. ఇలాంటివి మళ్లీ జరగవని చెప్పి మెటా నుంచి నాకు ఎలాంటి భరోసా గానీ సపోర్ట్ గానీ దొరకలేదు" అని సెబాస్టియన్ అన్నారు. కాగా, అసలైన కాపీరైట్ హక్కుదారులు లేదా వాళ్లు నియమించుకున్న ప్రతినిధులు మాత్రమే కాపీరైట్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయగలరని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోంది. బాధితులు నేరుగా ఆ హక్కుదారులనే సంప్రదించాలని సూచిస్తోంది. ఎదైనమైనా ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## భద్రాద్రి విమానాశ్రయానికి ముందడుగు

మొదటిపేజీ తరువాయి..

ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత విమానాశ్రయ స్థలాలను పరిశీలిస్తూ భూమి లభ్యత, స్థల విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, విమానాల రాకపోకలకు అవసరమైన అంశాలను అధ్యయనం చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాలుగా సుజాతనగర్ మండలంలోని సీతంపేట, సుజాతనగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను గుర్తించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో స్థల పరిశీలన, సర్వే, సాంకేతిక అంశాలను పరిశీలిస్తారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా అధికారులు బృందం వారి వెంట ఉన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాన్ని పెద్ద విమానాల రాకపోకలకు అనుగుణంగా సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్‌వే అవసరమయ్యే అవకాశాలను సాంకేతిక బృందం పరిశీలించింది. రన్‌వే ఏర్పాటుకు అవసరమైన భూమి, భవిష్యత్తు విస్తరణకు అవకాశాలు, నైట్ ల్యాండింగ్‌కు అవసరమైన సదుపాయాలు, భద్రతా పరికరాలు తదితర అంశాలపై కూడా అధ్యయనం చేసింది. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఎంపీ రఘురామి రెడ్డి తెలిపారు. ప్రతిపాదిత ప్రాంతాల్లో అన్ని అంశాలను బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తుందని చెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం టెక్నికల్ ఫీజిబిలిటీ అధ్యయనం చేసి విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తారు.

# కేసీఆర్ హత్యకు కుట్ర..



మొదటిపేజీ తరువాయి..

కేసీఆర్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నాయకులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నారని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ నివాసం వైపు కాంగ్రెస్ నేతలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది పోలీసులను మోహరించామని అధికారులు చెప్పినప్పటికీ.. తమ నాయకుడి భద్రత విషయంలో పోలీసులపై నమ్మకం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తమ నాయకుడిని తామే కాపాడుకోవాలి అంటూ బీఆర్ఎస్ నేతలు ముందుకు సాగారు. అసెంబ్లీ నుంచి కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎర్రవల్లి బయలుదేరారు. తొలుత బొల్లారం వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావులను నిలిపివేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కేసీఆర్ ఇంటి వైపు వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులకు అనుమతి ఇచ్చారా అని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించారు. కేసీఆర్ నివాసం వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు వివరించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు వెనక్కి తగ్గలేదు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా బయలుదేరారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రతిపక్షాలపై దృష్టి పెట్టిందని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు తెరలేపిందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకునే వరకు, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల తీరుపైనా కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించడానికే సభను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఒక రోజు రాజకీయ విమర్శలకు కేటాయించి, మిగిలిన సమయాన్ని ప్రజా సమస్యలపై చర్చించేందుకు వినియోగించాలని సూచించారు. దళితులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. దళితబంధు పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పటివరకు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతల అరెస్ట్‌తో మేడ్చల్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా బలగాలను మోహరించారు.
మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సభలో సమస్యలు చర్చించకుండా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సబిత ఇంద్రారెడ్డి గొంతు పిసికితే రేవంత్ రెడ్డికి కనపడలేదని, మహిళ ఎమ్మెల్యేలు ఫిర్యాదు ఇస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు ఏమనుకుంటారోనన్న జ్ఞానం లేదా అని నిలదీశారు. రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కౌరవులకు పట్టిన గతి కాంగ్రెస్‌కు పడుతుందని హరీశ్ వ్యాఖ్యానించారు. బీజేపీ సభ్యులు ప్లకార్డులతో అసెంబ్లీలోకి వెళ్లారన్న హరీశ్, దీన్నిబట్టే బడే భాయ్ చోటే భాయ్ బంధం అర్థం అవుతోందన్నారు. సీఎం చేతకాని తనం వల్ల క్రాప్ హాలిడే ఇచ్చే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడతామని స్పష్టంచేశారు. ఎవరిది అసభ్యకర భాష, ఎవరిది వికృత భాష అని ప్రజలు గమనిస్తున్నారు. కేసీఆర్ ఇంటి మీద ముఖ్యమంత్రి దాడికి ఉసిగొల్పారు. దీనిపై కేంద్రం జోక్యం చేసుకోవాలి. రేవంత్ రెడ్డి ఎప్పుడూ కేసీఆర్ చావును కోరుకుంటారు. ఎమ్మెల్యేల చేత కేసీఆర్ చావాలని మాట్లాడిస్తున్నారు. రేవంత్ రెడ్డి అండతోనే ఎమ్మెల్యే శంకర్ కేసీఆర్‌పై మాట్లాడారు. శంకర్ పై కేసుపెట్టాలి, సభ్యత్వం రద్దు చేయాలని అన్నారు.
కాగా బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కేటీఆర్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించిన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడికి భారీగా చేరుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా రావడంతో ఇరు వర్గాల మధ్య నినాదాలు, వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఇరువర్గాలు రాళ్లు, కుర్చీలు విసురుకోవడంతో ఆ ప్రాంతం అంతా రణరంగంగా మారిపోయింది. పరిస్థితి అదుపు తప్పడంతో కొందరు కార్యకర్తలు కుర్చీలు, రాళ్లు విసురుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ పార్టీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఆందోళన కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా అక్కడికి చేరుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత పెరిగింది. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకుంటూ కార్యకర్తలు ముందుకు రావడంతో పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకోగా, పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చినట్లు సమాచారం. రాళ్లు, కుర్చీలతో పరస్పరం దాడులు జరిగినట్లు ప్రత్యక్షంగా ఉన్నవారు చెబుతున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలైనట్లు తెలుస్తోంది. ఘర్షణలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు గాయపడినట్లు సమాచారం. ఓ మహిళా కార్యకర్త చేతికి తీవ్ర గాయమైందని.. చేయి విరిగినట్లు సమాచారం. అయితే గాయాలపై పూర్తి వివరాలు, ఘటనకు సంబంధించిన కారణాలపై అధికారికంగా పూర్తి సమాచారం వెలువడాల్సి ఉంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. అతి కష్టం మీద ఇరు వర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు. ఈ ఘటనల నేపథ్యంలో బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ సహా బీఆర్ఎస్ నేతలను తరలించిన పోలీస్ స్టేషన్ల పరిసరాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. తమ పార్టీ నేతలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుపట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న తమ నేతలకు కూడా రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లు సస్పెన్షన్

మొదటిపేజీ తరువాయి..

అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో





పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు. కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. తెలంగాణ శాసనమండలి ప్రాంగణంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును మార్షల్స్ బలవంతంగా ప్రాంగణం వెలుపలికి తరలించారు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి నెలకొంది. మండలి ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకు ఎమ్మెల్సీ తాతా మధు ప్రయత్నించారు. అయితే, ఆయనపై ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడినందున, మండలి ఆవరణలో మాట్లాడేందుకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆయనకు సూచించారు. అయినప్పటికీ, అధికారుల సూచనను తిరస్కరించిన తాతా మధు, అక్కడే ఉండేందుకు ప్రయత్నించారు. దీంతో మార్షల్స్ రంగప్రవేశం చేసి, ఆయన్ను బలవంతంగా అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. ఆయన నిరాకరించడంతో, మార్షల్స్ ఆయనను చేతులపై ఎత్తుకుని ప్రాంగణం వెలుపలికి తీసుకెళ్లారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తాతా మధుపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, మండలి ప్రాంగణంలో ఆయనను మాట్లాడకుండా అధికారులు అడ్డుకున్నారు.
మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ దిశగా వెళ్లడం లేదని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. తాతా మధు శాసనసభ సభ్యుడు కాకపోయినప్పటికీ (ఎమ్మెల్సీ), సభాధిపతిగా ఆయనపై చర్య తీసుకునే అధికారం తనకు ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "బీఆర్ఎస్ హయాంలో మాదిరిగా ఎవరినీ అకస్మాత్తుగా సస్పెండ్ చేయబోమని, ఈ వ్యవహారాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలోనే పరిష్కరిస్తాం" అని ప్రసాద్ కుమార్ వెల్లడించారు. ఈ వివాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ప్రతి అసెంబ్లీ సమావేశానికి ముందు సభకు హాజరుకావాలని తాను వ్యక్తిగతంగా కేసీఆర్‌ను కోరుతూనే ఉన్నానని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీలో మహిళా సభ్యుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపైనా స్పీకర్ స్పందించారు. విచారణలో పోలీసుల తప్పిదం ఉన్నట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, నేటి సభా కార్యక్రమాలకు తాను అధ్యక్షత వహించడం లేదని, ప్యానెల్ స్పీకర్ కడియం శ్రీహరి సభను నిర్వహిస్తారని గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

## త్వరలో బుల్లెట్ ట్రైన్ ట్రయల్స్

మొదటిపేజీ తరువాయి..

రైలు ప్రారంభోత్సవం జరిగే అవకాశం ఉందన్నారు. గుజరాత్‌లోని వడోదరలో నిర్వహించిన నమో ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో వైష్ణవ్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. బుల్లెట్ ట్రైన్ తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే సిద్ధమైందని, ప్రస్తుతం దానిపై స్ట్వేజ్ టెస్ట్ నిర్వహించేందుకు పంపించినట్లు తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఈ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నామని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. పరీక్షలు, భద్రతా పరిశీలనలు పూర్తయిన తర్వాత దశలవారీగా వాణిజ్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. 2027లో సూరత్-బిలిమోరా స్టేషన్ల మధ్య బుల్లెట్ రైలు సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గుజరాత్‌లోని వడోదర నుంచి ముంబయికి ప్రయాణ సమయం భారీగా తగ్గనుందని చెప్పారు. వడోదర నుంచి బుల్లెట్ ట్రైన్‌లో కేవలం గంటన్నరలో ముంబయి చేరుకోవచ్చని వైష్ణవ్ తెలిపారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ముఖ్యంగా సూరత్-వాపి సెక్షన్ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులోని వివిధ విభాగాల్లో నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. భారత్ స్వదేశీ సామర్థ్యాలను పెంచుకునే దిశగా ఈ ప్రాజెక్టు కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇక భారతీయ రైల్వేల్లో సమగ్ర మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. నిర్వహణ వ్యవస్థ నుంచి రిజర్వేషన్ విధానాల వరకు పాత నిర్మాణ పద్ధతుల నుంచి మౌలిక సదుపాయాల అభివృద్ధి వరకు అనేక అంశాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. సరుకు రవాణాను మరింత సమర్థంగా నిర్వహించేందుకు కొత్త రకాల వ్యాగన్లను కూడా రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఉప్పు రవాణా కోసం ప్రత్యేకంగా రూపొందించిన వ్యాగన్ డిజైన్లను ఈ



సందర్భంగా ప్రస్తావించారు. దేశంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేశామని మంత్రి చెప్పారు. జమ్మూకశ్మీర్‌లోని చెనాబ్ వంతెన, మిజోరంను రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టులను ఇందుకు ఉదాహరణలుగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేశామని, సుమారు 36,000 కిలోమీటర్ల కొత్త రైల్వే ట్రాక్‌లను అభివృద్ధి చేశామని వెల్లడించారు. వందే భారత్ సాంకేతికత ఆధారంగా కార్గో రైళ్ల తయారీ కూడా కొనసాగుతోందని చెప్పారు. కరోనా మహమ్మారి కారణంగా ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ రైల్వే అభివృద్ధి పనుల వేగాన్ని పెంచామని వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టులోని తొలి దశ 2020లో పూర్తయిందని, ఆ తర్వాత మిగిలిన విభాగాల పనులను మరింత వేగవంతం చేశామని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న ఆధునిక భారతీయ రైల్వే వ్యవస్థ భవిష్యత్ తరాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 11న మోదీ, పుతిన్ భేటీ!

మొదటిపేజీ తరువాయి..

చేస్తున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ, దౌత్య సంబంధాల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం కీలక ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం, అంతర్జాతీయ రవాణా ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా సుదీర్ఘంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత ముగింపు పలకడమే లక్ష్యంగా ఈ భేటీ సాగనుందని రష్యా అధికారిక కార్యాలయం 'క్రెమ్లిన్' ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. శుక్రవారం నాడు ఢిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందే మోదీ - పుతిన్ ఒకరిని ఒకరు కలవబోతున్నారు. అనంతరం ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధ పరిష్కారం కోసం భారత్ చూపిస్తున్న నిబద్ధతను, చొరవను రష్యా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని ఆయన వెల్లడించారు. అసలు తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, గతంలో మొదలైన ఈ వివాదానికి శాంతియుతంగా చుక్కాని పెట్టడానికే రష్యా ప్రయత్నిస్తోందని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ , అమెరికా మధ్య మళ్లీ శాంతి చర్చలు ప్రారంభమవుతాయని తాము ఆశిస్తున్నామని, శాంతి పునరుద్ధరణ కోసం భారత్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఆహ్వానించదగినవేనని కొనియాడారు. శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే కేవలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆ విదేశీ కుట్రలు ఫలించకుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషిస్తామని పునరుద్ఘాటించారు. కేవలం యుద్ధం మాత్రమే కాకుండా, రెండు దేశాల మధ్య ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. రష్యా విపణిలో పెట్టుబడులు పెట్టేందుకు భారత కంపెనీలు ఆసక్తి చూపుతుండగా, అదే సమయంలో భారత్‌లో తమ వ్యాపారాన్ని విస్తరించాలని రష్యా భావిస్తోంది. దీనికితోడు అంతర్జాతీయ రవాణా కారిడార్లు, సరుకు రవాణా ప్రాజెక్టులపై ఇరు నేతలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. అలాగే పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలు గ్లోబల్ ఎకానమీపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయనే అంశం కూడా మోదీ-పుతిన్ భేటీలో చర్చకు రానుంది.



## ప్రధాని పర్యటనలో తుపాకీ కలకలం

మొదటిపేజీ తరువాయి..

కార్డు, తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక వివరాల ప్రకారం, ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రాంగణంలో ఈ ఇద్దరిని గుర్తించారు. నకిలీ గుర్తింపు కార్డుతో ఉన్న వ్యక్తిని 24 ఏళ్ల రోహన్ పరేఖ్‌గా గుర్తించారు. అతనితో పాటు ఉన్న అంగరక్షకుడి వద్ద తుపాకీ ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భద్రతా సిబ్బంది తనిఖీల్లో గుర్తింపు కార్డు అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించగా అది నకిలీదని తేలింది. నకిలీ గుర్తింపు కార్డును ఎలా సంపాదించాడు? తాను అధికారినని ఎందుకు చెప్పుకున్నాడు? తుపాకీతో ఉన్న బాడీగార్డుతో కలిసి ప్రధాని కార్యక్రమం జరిగే ప్రదేశంలోకి ఎందుకు రావడానికి ప్రయత్నించారు? అనే అంశాలపై ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది. అయితే, ప్రస్తుతానికి ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతో వారు అక్కడికి వచ్చినట్లు ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ సెప్టెంబర్ 8న సాయంత్రం 5:45 గంటల సమయంలో ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026ను ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు జరిగే ఈ ఏడో ఎడిషన్‌లో ఫైనాన్స్ భవిష్యత్తు, ఏజెంటిక్ , టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితంపై చర్చలు జరగనున్నాయి. అంతకుముందు ప్రధాని గుజరాత్‌లోని వడోదరలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకిత కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో రూ.20,700 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లోని 326 రూట్ కిలోమీటర్ల మూడు కీలక విభాగాలు ఉన్నాయి.ప్రధాని ముంబై పర్యటనకు ముందు నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడటం భద్రతా వ్యవస్థను అప్రమత్తం చేసింది. ఈ ఘటన వెనుక అసలు ఉద్దేశం ఏంటన్నది క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## ఉత్తమ ఉపాధ్యాయునికి పురస్కారం



**సోనాల సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి) :** సోనాల మండల కేంద్రానికి చెందిన బొమ్మత సంజయ్ కుమార్ ట్రస్మా ఆదిలాబాద్ జిల్లా వారి ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని, ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ మరియు మున్సిపల్ చైర్మన్ బండారి అనూష చేతుల మీదుగా తీసుకున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.గంగాధర్ మరియు సహచర ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ఆశ వర్కర్ల అరెస్టులు సరికాదు



**జన్నారం, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి) :** ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కొరకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, చలో హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా కార్యక్రమానికి ఆశ వర్కర్లు వెళ్లకుండా ముందస్తుగా అరెస్టులు చేయడం న్యాయం కాదని, సిఐటియు సీనియర్ నాయకులు కూకటీకారు బుచ్చయ్య ఖండించారు. ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారు. వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులు. నేటికీ వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.కనీసం గ్యారంటీ ఫిక్స్ వేతనం కూడా ప్రభుత్వం నిర్ణయించలేదని,ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ధర్నా కార్యక్రమానికి వెళ్తుంటే పోలీస్ వారు అరెస్టు చేసి అడ్డుకోవడం సరికాదన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా అనేక హామీలు ఇచ్చింది.అవి నెరవేర్చలేదు.అలాగే కాంగ్రెస్ ప్రభుత్వము కూడా హామీలు ఇచ్చి ఇంత కాలం గడిచిన ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని అన్నారు.కామ్రేడ్ నీరజ మాట్లాడుతూ 50 లక్షల ఇన్సూరెన్స్, 50,000 మట్టి ఖర్చులు,రిటైర్మెంట్ బెనిఫిట్స్, తదితర హామీలు ఇచ్చి, ఇంతవరకు అమలు చేయలేదని, పిఆర్సి ఏరియాస్, లెప్రసీ, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు సంవత్సరాలు తరబడి పెండింగ్లో ఉన్నాయని అన్నారు. ఆశా వర్కర్లకు 18 వేల రూపాయల ఫిక్స్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు.అరెస్టు అయినా ఆశ వర్కర్లు జి.శైలజ, ఎం లక్ష్మి టి రాజేశ్వరి, డి వజ్రమాల, కళావతి ఆర్ గంగామణి, సుజాత, పి రమ, కే సునీత, ఎం శైలజ, ఎం భూమక్క, డి సూర్య తదితరులు అరెస్టు అయ్యారు.

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు ఖండించిన బి.ఆర్.ఎస్ నాయకులు



**జన్నారం, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం రోజున ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి భూక్య జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ నాయకులు,కార్యకర్తలు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కూడా హరించే విధంగా ముందస్తు అరెస్టులు చేయడం సరైన చర్య కాదని అన్నారు. అరెస్టులతో బీఆర్ఎస్ నాయకుల గొంతులను నొక్కలేరని, ప్రజా సమస్యలపై ప్రశ్నించే స్వరాలను ఆపలేరని అన్నారు. ముందస్తు అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అరెస్టయిన వారిలో సర్పంచ్ పేరం శ్రీనివాస్, సుతారి వినయ్ కుమార్, ఫజల్ ఖాన్,ఉపసర్పంచ్ కల్లెం శ్రీనివాస్ రెడ్డి,జాడి గంగాధర్, ప్రేమ్ సాగర్,శ్రీనివాస్ గౌడ్, బాధవత్ సాయికిరణ్,అప్పని సాయికుమార్ తదితరులు ఉన్నారు.

## స్టూడెంట్ యూనియన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎన్ ఎస్ యు ఐ నాయకులు



**జన్నారం, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి) :** ఢిల్లీ యూనివర్సిటీలో జరుగుతున్న స్టూడెంట్ యూనియన్ ఎలక్షన్స్ ప్రచారంలో ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాకర్ తో కలిసి జన్నారం మండల ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకులు సోహెల్ షా మరియు వాళ్ళ బృందం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. విద్యార్థుల కోసం ఎన్.ఎస్. యు ఐ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా బలోపేతం కోసం పూర్తి కృషి చేస్తామని జాతీయ అధ్యక్షుడికి తెలపడం జరిగింది. అతి తొందరలో తెలంగాణ రాష్ట్రంలో మంచిర్యాల్ జిల్లా జన్నారం మండలం ఒక పెద్ద ఎత్తున విద్యార్థులతో సభ పెట్టి ఆయనని ఆహ్వానిస్తాము అని తెలిపారు.

## వైద్యరంగంలో ముందుకెళ్తున్న ఫిజియో చికిత్సలు, శారీరక ఉల్లాసంతో పాటు త్వరగా వ్యాధులను కోల్పోయేలా చేసే చికిత్స ఫిజియో

- జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా - డాక్టర్ మంత్ర రాజం అజయ్ కృష్ణ, డాక్టర్ దివ్యశ్రీలవెల్లడి





**ఖానాపూర్ సెప్టెంబర్ 8(ప్రజాజ్యోతి) :** అనేక అనారోగ్య రుగ్మలతో సతమతం అవుతున్న మానవాళికి వైద్యరంగంలో ఫిజియోథెరపీ చికిత్స ముందుకెళ్తుందని సీనియర్ ఫిజియోథెరపీ డాక్టర్ మంత్ర రాజం అజయ్ కృష్ణ ఆయన సతీమణి ఫిజియోతెరపిస్ట్ డాక్టర్ దివ్యశ్రీలు అన్నారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రస్తుత నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణం శివాజీ నగర్ విధి కి చెంది హైదరాబాద్ నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రులైన కామినేని, కాంటినెంటల్, సిటిజన్, లాంటి ఆసుపత్రుల్లో పనిచేసిన అపార అనుభవాన్ని ఖానాపూర్లో ను అనేక సంవత్సరాల వ్యక్తిగత అనుభవం గడించి తోటి సీనియర్ డాక్టర్ల సలహాల చేయుతా మేరకు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నంలో రియల్ రిహాబిటేషన్ సెంటర్ ముఖ్య ఆస్పత్రిని ఆరిలోవా హెల్త్ సిటీ లో నెలకొల్పిన ప్రధాన్ ఆస్పత్రిలో మంగళవారం ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం గోపాలపట్నం శ్రీకాకుళం, ప్రాంతాల్లో బ్రాంచీలను నెలకొల్పి మరిన్ని సేవలు అందించి ఫిజియో ద్వారా ప్రజలకు చికిత్సను అందించి దీర్ఘకాలిక వ్యాధు లైన పక్షవాతం, ప్రమాదాలు జరిగి శస్త్ర చికిత్సల (ఆపరేషన్) అనంతరం శరీరం సచ్చిపడి అవయాలు కదలికలేక నెలల తరబడి మంచానికే పరిమితమై ఐసీయూ వ్యాధిగ్రస్తులకు సైతం శారీరక వ్యాయామాల ద్వారా నయం చేస్తున్నారు. కంప్యూటర్ యుగంలో మారుతున్న వైద్య చికిత్స సేవలో ఫిజియో ఆర్థోపెటిక్ న్యూరోలాజీ, కాడియోలజీ, రెస్కులేటరీ, అంకాలజీ చిన్న పిల్లలకు గర్భిణీ స్త్రీలకు క్యాన్సర్ గుండె బాధితులకు, ఫిడియో ట్రాక్ వయోవృద్ధ లాంటి వ్యాధులకు సైతం ఫిజియోథెరపీ ద్వారా చికిత్సలు జరుగుతున్నాయనిఅన్నారు దీని కొరకు అధునాతనమైన మిషన్లతో పాటు రెగ్యులర్ డాక్టర్ల సలహాల సూచనల మేరకు కేవలం ఫిజియోనే కాకుండా రోగి యొక్క స్థితిగతులను తెలుసుకునేందుకు రెగ్యులర్ అన్ని ట్రేడ్లకు చెందిన డ్యూటీ డాక్టర్లను ఏర్పాటు చేసుకొని చికిత్సలు అందించి వ్యాధి నివారణకు కృషి చేస్తున్నామని జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సమా వేశంలో రియోవెల్ రిహాబిటేషన్ సెంటర్ పర్యవేక్షకులు ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మంత్ర రాజం అజయ్ కృష్ణ వివరించారు వైద్యో నారాయణ హరి అన్న సందర్భంగా వైద్యం నారాయణుడు భగవంతునితో సమానమైన వృత్తిగా భావిస్తూ అత్యంత శ్రద్ధ శక్తులతో క్రమశిక్షణతో ప్రజల సేవ పరమార్థంగా పని చేయించేందుకే ఫిజియోథెరపీ ఈ ఆధునిక యుగంలో ముందుకు వస్తుందని అన్నారు తద్వారా వ్యాధిగ్ర స్తులకు మానసిక ఉల్లాసంతో పాటు వ్యాధిని త్వరితగతిన కోల్పోయే విధంగా ఈ తెరఫీ చికిత్స( వైద్య సేవలు) దోహదపడుతున్నాయని డాక్టర్ అజయ్ కృష్ణ తెలిపారు మంగళవారం సెప్టెంబర్ 8 జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవ సందర్భంగా వైద్యాధికారులకు సిబ్బందికి తదితరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## దళిత ఆత్మగౌరవాన్ని కించపరిచే మాటలను సహించం

- తాత మధును తక్షణమే బర్తరఫ్ చేయాలి
- పులికుంట గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు : ఇప్ప రమేష్



**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి) :** రెబ్బెన: దళిత సమాజం తరతరాలుగా ఎదుర్కొన్న సామాజిక వివక్ష, అవమానాలు, అసమానతలపై పోరాడుతూ నేడు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమానత్వం, స్వేచ్ఛ, ఆత్మగౌరవంతో ముందుకు సాగుతోందని పులికుంట గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇప్ప రమేష్ అన్నారు. దళితుల సామాజిక, రాజకీయ ఎదుగుదలకు రాజ్యాంగం ఎంతో గొప్ప భరోసాను కల్పించిందని పేర్కొన్నారు. అలాంటి దళిత సమాజం నుంచి ఎదిగి తెలంగాణ శాసనసభ స్పీకర్గా అత్యున్నత రాజ్యాంగ బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్పై తాత మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా బాధించాయని ఇప్ప రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తిపై రాజకీయ విమర్శ చేయడం వేరు, వ్యక్తిగత గౌరవాన్ని కించపరిచేలా మాట్లాడటం వేరని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాల్లో విమర్శలు ఉండాలి. ప్రశ్నలు ఉండాలి. ప్రభుత్వ విధానాలపై చర్చ జరగాలి. ప్రజా సమస్యలపై నాయకులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలి. కానీ విమర్శలకు కూడా ఒక హద్దు ఉంటుంది. వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసేలా, ఒక సామాజిక వర్గం మనోభావాలను గాయపరిచేలా, మహిళల గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు ఏమాత్రం మంచిది కాదు" అని ఇప్ప రమేష్ అన్నారు. స్పీకర్ పదవి కేవలం ఒక రాజకీయ నాయకుడికి లభించిన పదవి కాదని, అది రాష్ట్ర శాసన వ్యవస్థకు ప్రతీకగా నిలిచే రాజ్యాంగ పదవి అని ఆయన పేర్కొన్నారు. శాసనసభలో అధికార, ప్రతిపక్ష సభ్యులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ సభా కార్యక్రమాలను నిర్వహించే బాధ్యత స్పీకర్పై ఉంటుందని తెలిపారు.

"స్పీకర్గా ఎవరు ఉన్నారన్నది పక్కన పెడితే.. ఆ పదవికి ఉండే గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలి. ఒక రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై మాట్లాడేటప్పుడు మాటల విషయంలో సంయమనం పాటించాలి. వ్యక్తిగత రాజకీయ విభేదాలను రాజ్యాంగ పదవుల గౌరవంతో ముడిపెట్టడం సరైన పద్ధతి కాదు" అని ఆయన అన్నారు. దళిత సమాజం ఆత్మగౌరవం అనేది కేవలం ఒక రాజకీయ అంశం కాదని, అది తరతరాల పోరాటాల ఫలితమని ఇప్ప రమేష్ పేర్కొన్నారు. సమాజంలో గౌరవంగా జీవించేందుకు, సమాన హక్కులు పొందేందుకు అనేక మంది మహనీయులు చేసిన కృషిని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్మగౌరవం కోసం ఎన్నో తరాలు పోరాడాయి. అవమానాలను భరించి, అడ్డంకులను అధిగమించి, విద్యను ఆయుధంగా చేసుకుని, రాజ్యాంగాన్ని ఆధారంగా చేసుకుని దళితులు ముందుకు వచ్చారు. ఈరోజు ఒక దళిత బిడ్డ అత్యున్నత రాజ్యాంగ పదవిని చేపట్టడం వెనుక ఎంతోమంది త్యాగం, పోరాటం ఉంది. అలాంటి ఎదుగుదలను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది" అని అన్నారు. నాయకులు మాట్లాడే ప్రతి మాట ప్రజల్లోకి వేగంగా వెళ్తుందని, అందువల్ల ప్రజా జీవితంలో ఉన్నవారు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఇప్ప రమేష్ సూచించారు. ఒక నాయకుడి మాటలను అభిమానులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు కూడా అనుసరించే అవకాశం ఉంటుందని, కాబట్టి మాటల ద్వారా సమాజంలో విభేదాలు పెరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. మాటకు గాయం చేసే శక్తి కూడా ఉంది.. మనసును కలిపే శక్తి కూడా ఉంది. నాయకుల నోటి నుంచి వచ్చే మాటలు ప్రజలపై ప్రభావం చూపుతాయి. అందుకే మాటలు మనుషులను విడదీయడానికి కాకుండా కలిపేందుకు ఉపయోగపడాలి.

రాజకీయ భేదాలు ఉన్నా మానవ గౌరవాన్ని మాత్రం కాపాడాలి" అని ఇప్ప రమేష్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు కూడా తమ నాయకులు, ప్రజా ప్రతినిధులు చేసే వ్యాఖ్యల విషయంలో బాధ్యత వహించాలని ఆయన అన్నారు. పార్టీకి చెందిన నాయకుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేసినప్పుడు వాటిని సమర్థించడం కంటే, తప్పు జరిగితే తప్పును గుర్తించి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు మంచి సందేశం ఇవ్వాలని కోరారు. తాత మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఇప్ప రమేష్ డిమాండ్ చేశారు. అదేవిధంగా పార్టీ నాయకత్వం ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల మధ్య గౌరవం నిలవాలంటే నాయకుల మధ్య కూడా గౌరవప్రదమైన రాజకీయ సంస్కృతి ఉండాలి. ప్రత్యర్థిని రాజకీయంగా విమర్శించవచ్చు.. కానీ వ్యక్తిగతంగా అవమానించడం, సామాజికంగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం మాత్రం సరైనది కాదు" అని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, పార్టీ రాష్ట్ర నాయకత్వం ఈ అంశంపై మౌనం వీడి స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని ఇప్ప రమేష్ డిమాండ్ చేశారు. పార్టీ క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రజలకు చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా తాత మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ పదవుల గౌరవం, దళిత సమాజ ఆత్మగౌరవం, మహిళల గౌరవం వంటి అంశాల్లో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ స్పందించాలని వారు కోరారు. సమాజంలో కుల, మత, ప్రాంత, రాజకీయ భేదాల కంటే మానవత్వం, సమానత్వం, పరస్పర గౌరవం ముఖ్యమని ఇప్ప రమేష్ అన్నారు. ఒకరి గౌరవాన్ని కాపాడటం ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరి గౌరవాన్ని కాపాడినట్లేనని పేర్కొన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడటం దళితుల ఒక్కరి బాధ్యత కాదు. అది సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. ఒక వర్గాన్ని కించపరిచినప్పుడు మిగతా వర్గాలు మౌనంగా ఉండకూడదు. ఎందుకంటే ఈరోజు ఒకరిని అవమానించే మాట రేపు మరొకరిని బాధించవచ్చు. సమాజంలో గౌరవం పరస్పరం ఉండాలి" అని ఆయన అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఇప్ప రమేష్ పిలుపునిచ్చారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి రాజ్యాంగ విలువలను కేవలం పుస్తకాల్లో చదవడం కాకుండా, ప్రజా జీవితంలో ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం మనందరికీ సమాన గౌరవాన్ని ఇచ్చింది. ఆ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మనదే. పదవులు శాశ్వతం కావు.. అధికారాలు శాశ్వతం కావు.. రాజకీయ పరిస్థితులు శాశ్వతం కావు. కానీ మనిషి గౌరవం, రాజ్యాంగ విలువలు మాత్రం శాశ్వతంగా నిలవాలి అని ఇప్ప రమేష్ అన్నారు. రాజకీయ నాయకులు ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, వివాదాస్పద వ్యాఖ్యల ద్వారా సమాజంలో ఉద్రిక్తతలకు కారణం కాకుండా ప్రజలను కలిపే విధంగా మాట్లాడాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా రాజకీయ పార్టీలు కూడా తమ నాయకులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. మన రాజకీయ పోరాటం విధానాలపై ఉండాలి.. వ్యక్తుల గౌరవంపై కాదు. ప్రజాస్వామ్యంలో ప్రత్యర్థిని ఓడించవచ్చు.. కానీ అవమానించాల్సిన అవసరం లేదు. మనం గెలవాల్సింది రాజకీయంగా కావచ్చు.. కానీ మనిషి గౌరవాన్ని మాత్రం ఎప్పటికీ ఓడించకూడదు" అని ఆయన పేర్కొన్నారు. దళిత సమాజం ఎదుర్కొన్న చారిత్రక వివక్షను గుర్తు చేసుకుంటూ, భవిష్యత్ తరాలకు సమానత్వం, గౌరవం, సామాజిక న్యాయం కలిగిన సమాజాన్ని అందించాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన మాటతీరు, ప్రవర్తనను అలవర్చుకోవాలని కోరారు. చివరగా ఇప్ప రమేష్ మాట్లా డుతూ.. రాజకీయాలు మారవచ్చు.. పార్టీలు మారవచ్చు.. ప్రభుత్వాలు మారవచ్చు.. నాయకులు మారవచ్చు.. కానీ మనిషి గౌరవం మాత్రం మారకూడదు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే మాటలను సహించం. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిందే. తాత మధు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలి. పార్టీ నాయకత్వం వెంటనే స్పందించి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి" అని స్పష్టం చేశారు.

## అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుని వెంటనే సస్పెండ్ చేయాలి

మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో





**జన్నారం, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి) :** దళిత స్పీకర్పై అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలు చేసిన బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందు నాయక్ డిమాండ్ చేశారు. నిర్మల్ డిసిసి అధ్యక్షుడు, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మను తగలబెట్టడానికి ప్రయత్నించిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకు న్నారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు నందు నాయక్ మాట్లాడుతూ దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని అంతే కాకుండా బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ ను ఉద్దేశించి అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే అవమానకరమని అన్నారు. స్పీకర్ పదవి అనేది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన పదవి కాదని అది శాసనసభ గౌరవానికి రాజ్యాంగ వ్యవస్థకు ప్రతీక అని అన్నారు.కావున స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎమ్మెల్సీ తాత మధు వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనియెడల ఊరుకునేది లేదని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, ూవీజ చైర్మన్ దుర్గం లక్ష్మీ నారాయణ, పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ-భూమేష్, మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ ఫసిఉల్లా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముజాఫర్, రాజ సెల్ అధ్యక్షులు మామిడిపెల్లి ఇంద్రయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు రియజోద్దీన్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కుదిరే వెంకన్న, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్ చారి, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు గొర్రె మహేష్ యాదవ్,సీనియర్ నాయకులు ముత్యం సతీష్, దూమల్ల రమేష్, మచ్చ శంకరయ్య,సుధాకర్, నందు నాయక్, అబ్దుల్ ముజ్జు, దూమల్ల ప్రవీణ్, గంగన్న, పాదం రాకేష్, పాపా గౌడ్, సోషల్ మీడియా నాయకులు షాకిర్, రాహుల్, సర్పంచ్లు, వర్డ్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వడూర్లో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన



**నేరడిగొండ, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి) :** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వడూర్ గ్రామంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేర్లు, వివరాల సవరణలు, అభ్యంతరాలు తదితర అంశాలను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసాగర్ రెడ్డి, డీటీ విశ్వనాథ్, సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి సద్దాం, జీపీఓ అనూష, ఆర్ఐ మమత, బీఎల్ఓ రాజేష్, జూనియర్ అసిస్టెంట్ పెద్దుల సకీల్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల భూములు ఎవరి పరం..

యాపల్గూడలో ఇటుక బట్టీల వ్యవహారంపై తహసిల్దార్కు ఫిర్యాదు చేసిన తాళ్ల రవీందర్



**ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబర్ 9 (ప్రజా జ్యోతి) :** ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్గూడ గ్రామ పరిధిలోని ప్రొహిబిటెడ్ ల్యాండ్లో ఇటుక బట్టీల నిర్వహణపై సమగ్ర విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్కు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవిందర్ మంగళవారం తహసిల్దార్కు పిర్యాదు చేసారు.పేదల జీవనోపాధి కోసం ప్రభుత్వం కేటాయించిన భూములు కొందరి అక్రమ కార్యకలాపాలకు వేదికగా మారడం బాధాకరమన్నారు. సంబంధిత సర్వే నంబర్ల భూములు ప్రొహిబిటెడ్ ల్యాండ్లో ఉన్నప్పటికీ అక్కడ ఇటుక బట్టీల నిర్వహణ ఎలా కొనసాగుతోందనే విషయంపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.పేదలకు కేటాయించిన భూములను అక్రమంగా కొందరు తమ ఆధీనంలోకి తీసుకున్న తీరుపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలు నిర్ధారణ అయితే భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు న్యాయం చేయాలని తాళ్ల కోరారు.

## డిజిటల్ క్రాప్ సర్వేకు రైతులు సహకరించాలి - ఏఈఓ స్రవంతి



**నేరడిగొండ సెప్టెంబరు 08(ప్రజాజ్యోతి) :** వానాకాలం-2026 సీజన్లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్)లో నమోదు చేసుకోవాలని కుమారి వ్యవసాయ అధికారి స్రవంతి కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్లను నియమించినట్లు తెలిపారు. డీసీఎస్ వాలంటీర్లు క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేస్తారని పేర్కొన్నారు. వాలంటీర్లు నమోదు చేసిన పంట వివరాల ఆధారంగానే ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పంట కొనుగోలు చేపట్టే అవకాశం ఉంటుందని అన్నారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్లకు పూర్తి సహకారం అందించాలని ఆమె కోరారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత ఏఈఓ ను సంప్రదించాలని తెలిపారు.

## ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఎంపీడీవో



**సోనాల, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి) :** సోనాల మండల కేంద్రంలోని స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో రత్నాకర్ రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లోని గదులను, పరిసరాలను పరిశీలించిన ఆయన, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, వారికి అందిస్తున్న భోజనం నాణ్యత, మెనూ అమలు మరియు తాగునీటి సౌకర్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ --- హాస్టల్ ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వసతి గృహ సంక్షేమాధికారి విజయ్కుమార్ని ఆదేశించారు. భోజనంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులు చదువులో రాణించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

★ ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని,విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరై ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం పట్టణ శివారులోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయం





సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ఆయన ముచ్చటించి వారి విద్యాభ్యాసం, ఏకరూప దుస్తులు, రాత,పాఠ్యపుస్తకాలపై ఆరా తీశారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని,రాగి జావ లేదా పాలు తప్పనిసరిగా అందజేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.పాఠశాలలో తగినన్ని తరగతి గదులు ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంపై కలెక్టర్ ఆరా తీశారు.ప్రతిరోజూ విద్యార్థులందరూ పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పలువురు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను స్వయంగా తెలుసుకున్న కలెక్టర్ వారిని అభినందించారు.విద్యార్థులు క్రమశిక్షణతో,చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదిగి తమ తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.

## ఈనాడు ప్రతిభా పోటీల్లో విశిష్ట నోబుల్ విద్యార్థుల హ్యాట్రిక్!

★ వ్యాసరచన పోటీలో మూడు బహుమతులు కైవసం

గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 08: మంగళవారం రోజు ఈనాడు యాజమాన్యం నిర్వహించిన ఈనాడు ప్రతిభా పాటవ పోటీల్లో విశిష్ట నోబుల్ సీబీఎస్ఈ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు.సమాజంపై ఎల్‌నినో ప్రభావం"అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాఠశాల విద్యార్థులు ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించి ప్రతిభను చాటారు.10వ తరగతి విద్యార్థిని బి.ఐశ్వర్య ప్రథమ బహుమతి,9వ తరగతి విద్యార్థిని ఎన్. శృతి ద్వితీయ బహుమతి,9వ తరగతి విద్యార్థిని జె.యుక్తశ్రీ తృతీయ బహుమతి సాధించారు.ఒకే పోటీలో మూడు బహుమతులను కైవసం చేసుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విజేతలను పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి,ప్రిన్సిపాల్ విజయలక్ష్మి,శ్యామల, ఏఓ జయ,సుజాతతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు ప్రతిభా పాటవ పోటీల్లోనూ రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




## ప్రభుత్వ స్థలంపై కబ్జా ఆరోపణలు

– పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తుల ఫిర్యాదు చర్యలు తీసుకోవాలని డిమాండ్


అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 08: జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం బొంకూరు గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేశాడని ఆరోపిస్తూ గ్రామస్తులు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వం గ్రామంలో పేదలకు ప్లాట్లుకేటాయించిందని, అందులో ఓ వ్యక్తికి కేటాయించిన ప్లాట్‌ను మరొకరికి విక్రయించిన మిగిలిన ప్రభుత్వ స్థలాలను సైతం ఆక్రమించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించిన వ్యక్తిపై విచారణ జరిపి, వెంటనే చర్యలు తీసుకోవాలని వారు పంచాయతీ కార్యదర్శిని కోరారు. ప్రభుత్వ స్థలాలను కాపాడి,అర్హులైన వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన టీచర్ అగస్టిన్

★ టీచర్ ఆగస్టిన్ నీ అభినందించిన డాక్టర్ ప్రేమ్ కుమార్

గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 08: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ పొందిన తప్పెట్ల మోర్స్ హై స్కూల్ టీచర్ అగస్టిన్ ఆదర్శప్రాయుడు అని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు.పేద విద్యార్థులకు జ్ఞానం అందిస్తూ విద్యా వ్యవస్థలో ఆయన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని.అంతే కాక కొద్ది మంది టీచర్ లు మాత్రమే ఎంపిక అయ్యే ఫిన్లాండ్ పర్యటనకు టీచర్ అగస్టిన్ ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయం అని.పేద,మధ్య తరగతి విద్యార్థులకు జ్ఞానం అందిస్తూ తన సేవలు పరిపూర్ణంగా సఫలీకృతం చేసుకుంటూ వెళ్తున్న టీచర్ అగస్టిన్ ఆదర్శప్రాయుడు అని కొనియాడారు.ఉత్తమ ఉపాధ్యాయుడి గా ఎన్నికైన సందర్భంగా సామాజిక



విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ టీచర్ అగస్టిన్ ను ఘనంగా సన్మానించారు.

## అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి

★ ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

★ మహబూబ్‌నగర్‌లో ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ అవగాహన ర్యాలీ

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ): అక్షరాస్యతే వ్యక్తి సాధికారతకు, కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి పునాది అని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అందిపుచ్చుకొని తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎన్ ఐ ఎల్ పి – ఉల్లాస్ కార్యక్రమం కింద అక్షరాస్యత అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీని కలెక్టర్ ఖుష్బూ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మల్లికార్జున్ ఎంటర్‌ప్రైజెస్ మీదుగా సాగి అంబేద్కర్ చౌరస్తా వద్ద ముగిసింది.ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, మహిళలు, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని “ప్రతి ఒక్కరూ చదవాలి––ప్రతి ఒక్కరూ ఎదగాలి” అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాదని, అది వ్యక్తిలో అవగాహన, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి సాధికారతకు దోహదం చేస్తుందని తెలిపారు. అక్షరాస్యత పెరిగిన కొద్దీ ఉపాధి అవకాశాలు, కుటుంబాల అభివృద్ధి, సామాజిక చైతన్యం పెరుగుతాయని పేర్కొన్నారు.“అక్షరం ప్రతి ఒక్కరి హక్కు. విద్య ప్రతి కుటుంబానికి బలం. నిరక్షరాస్యతను నిర్మూలించి ప్రతి వ్యక్తిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దడం మనందరి సామాజిక బాధ్యత” అని కలెక్టర్ అన్నారు.




**నిరక్షరాస్యులను విద్య వైపు ప్రోత్సహించాలి:**

వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం, నిరక్షరాస్యులను విద్య వైపు ప్రోత్సహించడం, విద్య ప్రాముఖ్యతను ప్రతి ఇంటికీ చేరవేయడం లక్ష్యంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, డీఈఓ విజయకుమారి, డీఆర్‌డీఓ నర్సింహులు, వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడే పర్యావరణానికి మేలు

★ జిల్లాలో 2 వేల మట్టి విగ్రహాల పంపిణీకి ఏర్పాట్లు

★ బాల్య వివాహాల నిర్మూలనకు అధికారుల స్వచ్ఛంద సంస్థల సమన్వయం అవసరం: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, సెప్టెంబరు 8 (ప్రజాజ్యోతి): వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రజలు మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 14న జరగనున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలు పూర్తిగా పర్యావరణహితమైనవని తెలిపారు. నీటిలో త్వరగా కరిగిపోవడం వల్ల జల వనరుల కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాల నిమజ్జనం వల్ల చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా మట్టి



వినాయక విగ్రహాల వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**త్వరలో 2 వేల మట్టి విగ్రహాల పంపిణీ**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ద్వారా జిల్లాకు 2 వేల మట్టి వినాయక విగ్రహాలను త్వరలో పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని కోరారు.

**బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి**

బాల్య, బలవంతపు వివాహాల నిర్మూలనకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, జిల్లా సంక్షేమ శాఖ సంయుక్తంగా రూపొందించిన బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. బాల్య వివాహాల వల్ల తలెత్తే సామాజిక, ఆరోగ్యపరమైన సమస్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. బాలల హక్కులను పరిరక్షిస్తూ బాలికలకు విద్య, భద్రత, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్త, నోడల్ అధికారి అనిల్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, కార్మిక శాఖ అధికారి రవి, డిసిపిఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అనధికార ‘మీ సేవ’లపై ఉక్కుపాదం!

★ వార్తాపత్రికలలో కథనంతో రంగంలోకి అధికారులు.. జిల్లా వ్యాప్తంగా ఇంటర్నెట్ కేంద్రాల తనిఖీలు

★ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

★ ప్రజలు అధికారిక కేంద్రాలనే ఆశ్రయించాలి: అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

వనపర్తి ప్రతినిధి, సెప్టెంబరు 8 (ప్రజాజ్యోతి): ప్రభుత్వం కేటాయించిన నిర్దేశిత ప్రదేశాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో అనధికారికంగా మీ సేవ, ఓఎస్ఎస్ ప్రభుత్వ సేవలు నిర్వహిస్తున్న ఇంటర్నెట్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) హెచ్చరించారు. ఈ అంశంపై వార్తాపత్రికలో ప్రచురితమైన కథనాన్ని పరిగణనలోకి తీసుకొని అధికారులు రంగంలోకి దిగారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు వనపర్తి ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్, ఎంఆర్ఐ అధికారులు జిల్లాలోని పలు ఇంటర్నెట్ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం కేటాయించిన ప్రాంతాల్లో కాకుండా ఇతర ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా అనధికారికంగా మీ సేవ ప్రభుత్వ సేవలు అందిస్తున్న కేంద్రాలను గుర్తించారు. రాజపేట గ్రామం, వనపర్తి, అలాగే ఆత్మకూర్ మండలం రెచింతల గ్రామానికి సంబంధించిన ఓఎస్ఎస్ ఐడీలు గల కేంద్రాలు ప్రభుత్వం కేటాయించిన నిర్దేశిత ప్రదేశాల్లో కాకుండా వేరే ప్రాంతాల్లోని ఇంటర్నెట్ సెంటర్లలో నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ




నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన మీ సేవ, ఓఎస్ఎస్ కేంద్రాలను ముందస్తు అనుమతి లేకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం, అనధికార వ్యక్తులతో నిర్వహించడం లేదా ఇతర ఇంటర్నెట్ కేంద్రాల ద్వారా ప్రభుత్వ సేవలను అందించడం అనుమతించబోమని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించిన కేంద్రాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా మీ సేవ, ఓఎస్ఎస్, ఇతర ప్రభుత్వ సేవలు నిర్వహిస్తున్న కేంద్రాలను గుర్తించేందుకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. జిల్లాలోని అన్ని మీ సేవ, ఓఎస్ఎస్ కేంద్రాల నిర్వాహకులు తమకు ప్రభుత్వం కేటాయించిన నిర్దేశిత ప్రదేశాల్లోనే సేవలు నిర్వహిస్తూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

అనధికార వ్యక్తులు, అనధికారిక ఇంటర్నెట్ కేంద్రాల ద్వారా ప్రభుత్వ సేవలు పొందే ప్రయత్నంలో ప్రజలు మోసపోయి ఆర్థికంగా నష్టపోకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రభుత్వ సేవల కోసం అధికారికంగా కేటాయించిన మీ సేవ, ఓఎస్ఎస్ కేంద్రాలను మాత్రమే సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. అనధికారికంగా ప్రభుత్వ సేవలు నిర్వహిస్తున్న కేంద్రాలు లేదా వ్యక్తులపై సమాచారం ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

## మెదడు ఆపరేషన్‌కు రోబో చేయూత

# యశోదలో అధునాతన న్యూరోసర్జరీ

★ మెదడు శస్త్రచికిత్సలో ‘రోసా’ రోబోట్ విప్లవం! ★ జీపీఎస్‌లా మార్గనిర్దేశం చేస్తూ.. అత్యంత కచ్చితత్వంతో సంక్లిష్ట న్యూరోసర్జరీకి కొత్త భరోసా

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ): సంక్లిష్టమైన మెదడు కణితుల శస్త్రచికిత్సలో ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని, రోబోటిక్ న్యూరోసర్జరీ ద్వారా మరింత ఖచ్చితత్వంతో చికిత్స అందించే అవకాశాలు పెరుగుతున్నాయని యశోద హాస్పిటల్స్ న్యూరో సర్జన్ డా. అయ్యాదురై తెలిపారు. సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్న ‘రోసా’ బ్రెయిన్ రోబోట్ న్యూరోసర్జన్‌కు శస్త్రచికిత్స సమయంలో జీపీఎస్ తరహాలో మార్గనిర్దేశం చేస్తుందని వివరించారు. శస్త్రచికిత్స ప్రక్రియలో నిరంతర ఫీడ్‌బ్యాక్ అందించడం ద్వారా మెదడులోని లోతైన ప్రాంతాల్లో ఉన్న కణితులను కూడా అత్యంత కచ్చితత్వంతో చేరేందుకు ఈ సాంకేతికత సహకరిస్తుందని తెలిపారు.

**కీ-హోల్ సర్జరీకి మరింత ఖచ్చితత్వం:**

మెదడులోని సంక్లిష్ట ప్రాంతాల్లో ఉన్న కణితులకు చికిత్స అందించే సమయంలో మిల్లీమీటర్ స్థాయి ఖచ్చితత్వం ఎంతో కీలకమని వైద్య నిపుణులు పేర్కొన్నారు. రోబోటిక్ సహకారంతో కీ-హోల్ విధానంలో శస్త్రచికిత్స నిర్వహించేందుకు వీలవుతుందని, తద్వారా సంక్లిష్ట బ్రెయిన్ ట్యూమర్ల చికిత్సలో భద్రత, ఖచ్చితత్వాన్ని మరింత




మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఇంట్రా -ఆపరేటివ్ ఎం ఆర్ ఐ, ఇంట్రా -ఆపరేటివ్ మానిటరింగ్, న్యూరోనావిగేషన్, హైఎండ్ మైక్రోస్కోప్, ఎండోస్కోప్ వంటి ఆధునిక వైద్య సదుపాయాలతో పాటు న్యూరోసర్జన్ అనుభవం కలిసినప్పుడే మెరుగైన చికిత్సా ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు.

**న్యూరో ఎండోస్కోపీలో ప్రత్యేక కేంద్రం:**

యశోద సెంటర్ ఫర్ న్యూరో ఎండోస్కోపీ ద్వారా ముక్కు మార్గం లేదా కీ-హోల్ విధానంలో చికిత్స చేయగల మెదడు, స్కల్ బేస్ సంబంధిత వ్యాధులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పిట్యూటరీ అడినోమా, క్రానియోఫారింజియోమా, స్కల్ బేస్ మెనింగియోమా, క్రానియోఫారింజియోమా వంటి కణితులతో పాటు సిఎస్ఎఫ్ రైనోరియా, స్కల్ బేస్ రిపేర్, స్కల్ బేస్ ఆస్టియోమైలైటిస్ తదితర సమస్యలకు సమగ్ర చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. అలాగే ట్రైజెమినల్ న్యూరాల్జియా, హెమీ ఫేషియల్ స్పాసమ్ వంటి సమస్యలకు నిర్వహించే ఎండోస్కోపిక్ మైక్రోవాస్కులర్ డీకంప్రెషన్ కూడా న్యూరో ఎండోస్కోపీ విభాగంలో ప్రత్యేకతగా నిలుస్తుందని తెలిపారు. యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో మంగళ వారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హాస్పిటల్ ప్రతినిధులు న్యూరో సర్జన్ డా. అయ్యాదురై, మేనేజర్ బి. సుదర్శన్ రెడ్డి, రోహిత్ కుమార్ పాల్గొని ఆధునిక న్యూరోసర్జరీలో అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, రోబోటిక్ శస్త్రచికిత్సల ప్రత్యేకతలను వివరించారు. సంక్లిష్టమైన మెదడు శస్త్రచికిత్సల్లో ఆధునిక సాంకేతికతను వైద్య నిపుణుల అనుభవంతో సమన్వయం చేయడం ద్వారా రోగులకు మరింత సురక్షితమైన, ఖచ్చితమైన చికిత్స అందించే దిశగా యశోద హాస్పిటల్స్ కృషి చేస్తోందని వారు పేర్కొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పిఆర్టియు లక్ష్యం

★ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి

నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 8( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ టీఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, సమస్యలు పరిష్కరించే వరకు ఉపాధ్యాయ సమరం ఆగదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు. మంగళవారం కల్వకుర్తిలోని కేబీఎన్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై. ముందుగాపీఆర్టీయూ టీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దొడ్ల సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తుమ్మల సురేందర్ రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా సూర్య శ్రీనివాస్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్య ఎదురైనా వారి పక్షాన నిలబడి, వాటి పరిష్కారం కోసం అన్ని విధాలుగా కృషి చేసే సంఘం పీఆర్టీయూ టీఎస్ అని పేర్కొన్నారు.ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పరిష్కారం లభించే వరకు ఉద్యమ కార్యాచరణను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఇటీవల సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద పీఆర్టీయూ టీఎస్



ఆధ్వర్యంలో సుమారు 30 వేల మంది ఉపాధ్యాయులతో నిర్వహించిన మహాధర్నాను ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహాధర్నా ద్వారా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వానికి బలమైన సందేశం వెళ్లిందని తెలిపారు. దీంతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం కూడా సానుకూలంగా ఆలోచించే పరిస్థితి ఏర్పడిందన్నారు.

**సీపీఎస్ రద్దు, పీఆర్సీ, డీఏపై పోరాటం**

సీపీఎస్ రద్దు, పీఆర్సీ, డీఏ, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు, ఇన్‌సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ వంటి అనేక సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ నిరంతరం పోరాడుతోందని ఎమ్మెల్సీ తెలిపారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనలో పీఆర్టీయూ చేపట్టిన ఉద్యమాలు ప్రభావంచూపుతున్నాయని పేర్కొన్నారు.డిసెంబర్ 10న జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని





విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు ఆయన పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలునూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి, ఎడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారులు రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, బల్మూరు రామచంద్రరావు, బిచ్చ నాయక్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు, జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు..

చలివాగు వద్ద నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్..



**పరకాల సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి :** వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని పరకాల పట్టణంలో వినాయక ప్రతిమల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయడంపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ మంగళవారం చలివాగు వద్ద నిమజ్జన స్థలాన్ని పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, యువతకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, పారిశుధ్య ఏర్పాట్లు, విద్యుత్ సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణ ప్రజలు, వినాయక మండపాల నిర్వాహకులకు అవసరమైన సహకారం అందిస్తూ నిమజ్జన ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు మున్సిపల్ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఏకు దివ్య–విద్యాసాగర్, కౌన్సిలర్లు కొయ్యాడ శ్రీనివాస్, బండి శ్రీధర్, గూడెల్లి సదన్న, సుదమల్ల రమేష్, బొచ్చు మాధవిలత–జాన్సన్, దుబాసి వెంకటస్వామి, బొచ్చు శ్యామల–బాబురావు, మున్సిపల్ ఏఈ కే. ప్రవీణ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి, మున్సిపల్ టీపీ రాజు కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఒంటేరు శ్రవణ్ కుమార్, మంద నాగరాజు, మేరుగు శ్రీశైలం, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చల్లా ధర్మారెడ్డి జన్మదిన వేడుకలు..

కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ..




**పరకాల సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి :** మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పరకాల పట్టణ బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ ఉపాధ్యక్షుడు దుంపేటి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా కుంకుమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చల్లా ధర్మారెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చల్లా ధర్మారెడ్డి భవిష్యత్తులో మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికై పరకాల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఆయనకు కలగాలని, సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గురిజాల ప్రకాష్‌రావు, నేతాని శ్రీనివాస్‌రెడ్డి, దుబాసి వెంకట స్వామి, శనిగరపు నవీన్, నల్లెల లింగమూర్తి, బొచ్చు బాపూరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు తమ ఓటును కాపాడుకోవాలి..

- ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి..
- 19వ వార్డు కౌన్సిలర్ కొయ్యాడ శ్రీనివాస్



**పరకాల సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి :** ఓటర్ల జాబితాలో తమ ఓటు సక్రమంగా ఉండేలా ప్రతి ఓటరు బాధ్యతగా వ్యవహరించాలని పరకాల మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ కొయ్యాడ శ్రీనివాస్ సూచించారు. 19వ వార్డులోని 46, 47 బూత్‌ల పరిధిలో ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్లకు అందజేసిన నోటీసులకు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలని, అందుబాటులో ఉన్న ఏదైనా గుర్తింపు కార్డును సంబంధిత బీఎల్ఓకు సమర్పించడం ద్వారా తమ ఓటును భద్రపరుచుకోవచ్చని తెలిపారు. ప్రతి ఓటరు తన ఓటుతో పాటు కుటుంబ సభ్యుల ఓట్లను కూడా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో నిర్ధారించుకుని, నోటీసులు అందిన వారు నిర్ణీత ప్రక్రియ ప్రకారం సమాధానం ఇవ్వాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, దానిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, డీటీ సుమన్, ఆర్ఐ దామోదర్, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒంటేరు శ్రవణ్ కుమార్, బీఎల్ఓలు సునీత, మల్లికాంబ, బీఎల్ఏలు దుప్పటి రాజేష్, ఎండీ షఫీ, అర్జున్, సతీష్‌తో పాటు 19వ వార్డు ప్రజలు, 46, 47 బూత్‌ల ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే చల్లా దంపతులు..

**పరకాల, సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి :** పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఉదయం కుటుంబసమేతంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీవారి ఆశీస్సులు పొందారు. శ్రీవారి కృపాకటాక్షాలతో పరకాల నియో జకవర్గ ప్రజలందరూ సుఖసంతో షాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు చల్లా ధర్మారెడ్డి తెలిపారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకుల నుంచి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



# ఈవీఎం గోదాంలో పగడ్బందీ ఏర్పాట్లు..

స్ట్రాంగ్‌రూమ్‌లు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి..





**హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి :** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మంగళవారం సుబేదారిలోని రెడ్‌క్రాస్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను త్రైమాసిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఎన్. రవి, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాంలోని భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల పరిస్థితి, వాటికి వేసిన సీల్స్, తాళాలు, ప్రవేశ––నిష్క్రమణ విధానం తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. భద్రతకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, గోదాం భద్రతకు సంబంధించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిరంతర నిఘాలో భాగంగా గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన కలెక్టర్, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఎన్నికల సంఘం నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల సీల్స్, తాళాలు, ప్రవేశ––నిష్క్రమణ వ్యవస్థ, సీసీ కెమెరాల నిఘా తదితర అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ తనిఖీలో హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్‌తో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ నుంచి ఈ.వి. శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నుంచి బి. ప్రవీణ్ కుమార్, బీజేపీ నుంచి నర్మెట శ్రీనివాస్, టీడీపీ నుంచి కుసుమ శ్యాంసుందర్, వైఎస్ఆర్‌సీపీ నుంచి నాగబెల్లి రజినీకాంత్, బీఎస్పీ నుంచి అంబాల ప్రశాంత్, ఏఐఎంఐఎం నుంచి సయ్యద్ ఫైజుల్లా, సీపీఎం నుంచి జి. వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడితో పర్యావరణ పరిరక్షణ






**హసన్‌పర్తి, సెప్టెంబరు 8 (ప్రజాజ్యోతి) :** మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట శాంతారాం కర్ణ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని అసంపర్తిలో పాఠశాల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మట్టి వినాయక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శాంతారాం కర్ణ మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి వేడుకలు భక్తి, ఆనందాలకు ప్రతీకలన్నారు. అయితే రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను చెరువులు, జలాశయాల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై జలచరాలు, పశుపక్ష్యాదులు, మానవులకు హాని కలిగే ప్రమాదం ఉందన్నారు. ప్రకృతి పరిరక్షణకు ప్రతీకగా నిలిచే మట్టి వినాయక విగ్రహాలను పూజించడం మన సంస్కృతిని కాపాడటంతోపాటు భూమాత పట్ల కృతజ్ఞతను చాటుతుందన్నారు. తమ పాఠశాల పర్యావరణహిత పాఠశాలగా గత 30 ఏళ్లుగా పర్యావరణ మిత్ర విభాగం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సుమారు 1,500 మట్టి వినాయక విగ్రహాలను విద్యార్థులతో తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 35 వేలకుపైగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశామన్నారు. కరపత్రాల పంపిణీ, అవగాహన ర్యాలీల ద్వారా ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇళ్లలో మట్టి వినాయక విగ్రహాలను పూజించి ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. "మట్టి వినాయకుడు–పర్యావరణానికి రక్షకుడు.. పర్యావరణాన్ని కాపాడుదాం–మట్టి వినాయకుడిని పూజిద్దాం" అని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మట్టి వినాయకుడిని పూజిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయుడు గూడూరు లక్ష్మీనారాయణతోపాటు ఉపాధ్యాయులు జూపాక నాగరాజు, ఏ. వెంకట్, రాధాకుమారి, మానస, అరుణ, గీత, జి. సంధ్య, సి. హెచ్. సంధ్య, దేవిక, స్వప్న, సరిత, ప్రవళిక, లావణ్య, దివ్యరాణి, సుచిత్ర, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణనీ కాపాడదాము

- కొత్తూరు గ్రామ సర్పంచ్ - కందికట్ల స్వప్న సంతోష్





**రాయపర్తి సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి :** మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అని కొత్తూరు గ్రామ సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామపంచాయతీ కార్యాలయము ఆవరణలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన కొత్తూరు గ్రామం అందరికీ ఆదర్శంగా నిలవాలి అంటే, ఈ వినాయక చవితి పర్వదినాన మనమంతా మట్టితో చేసిన ప్రతిమలనే పూజిద్దాం.

కాలుష్య రహిత గ్రామం మన పిల్లల భవిష్యత్తు కోసం, రేపటి తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి రసాయనాలు లేని విగ్రహాలనే ఎంచుకుందాంఆరోగ్యవంతమైన సమాజం: పర్యావరణ పరిరక్షణ మనందరి ఉమ్మడి బాధ్యత. నీటి వనరులను కలుషితం కాకుండా కాపాడుకోవడం మన కర్తవ్యం అన్నారు.

మట్టి వినాయకుడే ఆదర్శం --- కాలుష్యం లేని పండుగే మన లక్ష్యం!ఈ పండుగను ప్రకృతికి హాని కలగకుండా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని గ్రామ ప్రజలందరినీ కోరుతున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎండి ఆస్మా, వార్డు సభ్యులు తాటికాల నాగరాణి భాస్కర్, మాంకాళి రామాఎల్లయ్య, భీమన అపర్ణ కృష్ణ, నేలవెల్లి సుబ్బారావు, కారోబార్ కందికట్ల సురేష్ గల్లి గణేష్ యూత్ సభ్యులు, రామాలయం యూత్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారూ.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడి..



**పరకాల సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి :** అసెంబ్లీ సభాపతిని ఉద్దేశించి ఇటీవల అనుచిత భాషను ఉపయోగించడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'ఛలో ఎర్రవెల్లి' కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నాయకత్వంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. అసెంబ్లీ వంటి ప్రజాస్వామ్య వేదికల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు. సభాపతిని దుర్భాషలాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీనుతో పాటు చేపూరి చిరంజీవి, దబ్బేటా రమేష్, గోవిందు శ్వేత, పరశురామ్, పుల్యాల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన 50 మంది నాయకులు, కార్యకర్తలు



**రఘునాథపల్లి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి) :** రఘునాథపల్లి మండలం కంచనపల్లి మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఈరోజు తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రఘునాథపల్లి మాజీ ఎంపీపీ వై. కుమార్ గౌడ్, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ గవ్వని నాగేశ్వరరావు, రఘునాథ్పల్లి కంటెస్టెంట్ సర్పంచ్ గూడ కిరణ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుండె జోసెఫ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు డాక్టర్ రాజయ్య బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని డాక్టర్ రాజయ్య పిలుపునిచ్చారు. కంచనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరడం పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి





**రాయపర్తి సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కాట్రపల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెలుపుగొండ ఎల్లయ్య మరియు బూడిద కొమురమ్మ ఇటీవల అనారోగ్యం తో మరణించగా, మంగళవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు వారి కుటుంబ సభ్యులనుపరామర్శించి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం చేసినారు.

ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లానాయకులుబిపరుపటి శ్రీనివాస్ రెడ్డి. ఈ సహాయంను వారి కుటుంబ సభ్యులకు అందించిన రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, కక్ర రవీందర్ రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, పుల్ల ఎల్లగౌడ్, దేశాబోయిన ఉపేందర్, చందు రాము, సంకినేని ఎల్లస్వామి చిలువేరు సాయి గౌడ్ స్థానిక నాయకులు అయిన గిరుక సురేష్, ఎండీ అన్వార్, మొర్రి రాజేందర్, ముద్రబోయిన శ్రీనివాస్, చిదిమిళ్ల అశోక్, బూడిద సోమయ్య, బూడిద శ్రీధర్, ఎండీ కలిల్, బూడిద యాకయ్య, కందుకూరి వెంకన్న, వెలుపుగొండ బిక్షపతి ఎండీ అబ్బాస్కందుకూరి సాధధామ్ గదారి ఉపేందర్ బూడిద సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు కనిపిస్తే చర్యలు తప్పవు..

వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్..





**పరకాల సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి :** పట్టణంలో పారిశుద్ధ్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ 20, 21వ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. 20వ వార్డులో చేపడుతున్న నూతన డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను పరిశీలించిన చైర్మన్ పనుల నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్ణీత ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం 21వ వార్డులో చెట్లు మొలిచిన, చెత్తాచెదారంతో నిండిన ఖాళీ ప్లాట్లను పరిశీలించారు. ప్లాట్లలో అపరిశుభ్రత కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ పాలకుర్తి శ్రీనివాస్, 21వ వార్డు కౌన్సిలర్ సుదమల్ల రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు కొయ్యాడ శ్రీనివాస్, బండి శ్రీధర్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు ఏకు విద్యాసాగర్, మేరుగు శ్రీశైలం, బొచ్చు సాల్మన్ తదితరులు పాల్గొన్నారు

## నాణ్యతతో కూడిన అభివృద్ధే లక్ష్యం

- పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి
- జిడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



**వరంగల్ సిటీ, సెప్టెంబర్ 8(ప్రజాజ్యోతి) :** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో పూర్తయిన అభివృద్ధి పనులను, బిల్లుల చెల్లింపుల నిమిత్తం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా 49వ డివిజన్‌లోని రెవెన్యూ కాలనీ, ప్రకాశరెడ్డిపేట ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించారు. అనంతరం 22వ డివిజన్‌లోని పోచమ్మ మైదాన్, 21వ డివిజన్ ఎల్బీనగర్, 36వ డివిజన్‌లోని చింతల్, 38వ డివిజన్‌లోని ఖిలా వరంగల్ ప్రాంతాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మంచినీటి పైప్‌లైన్‌ల నిర్మాణ పనుల నాణ్యతను కమిషనర్ పరిశీలించారు. పోచమ్మ మైదాన్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను కూడా పరిశీలించి, నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, పనుల పూర్తికి ముందు అధికారులు క్షేత్రస్థాయిలో నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్ బాబు, డీఈలు, ఏఈలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా నేతన్న టీవీ బిగ్గెస్ట్ అవార్డ్స్ 2026

పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్‌కు ఉత్తమ పద్మశాలి సేవ పురస్కారం



**వరంగల్ సిటీ, సెప్టెంబర్ 08(ప్రజాజ్యోతి) :** నేతన్న టీవీ ఛానల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని హనుమకొండలో గల ఎస్‌వీఎస్ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 'నేతన్న టీవీ బిగ్గెస్ట్ అవార్డ్స్––2026' ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నేతన్న టీవీ అధినేత పులికంటి రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశాలి తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ హాజరై పలువురు ప్రతిభావంతులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం శివనగర్ కు చెందిన పద్మశాలి ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్‌కు 'ఉత్తమ పద్మశాలి సేవ పురస్కారం––2026' అందజేశారు. అవార్డు స్వీకరించిన శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మశాలి సమాజం ఐక్యతతో ముందుకు సాగుతూ విద్య, ఉద్యోగ, వ్యాపార, వృత్తి రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పద్మశాలీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి చేనేత రంగ ప్రతిభావంతులు, జర్నలిస్టులు, వివిధ వృత్తి రంగాల నిపుణులు, పద్మశాలి ప్రముఖులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## మేళ్ల దుప్పలపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

**అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలి...బోగరి అనిల్ కుమార్**





**నల్గొండ రూరల్ సెప్టెంబర్ 8,(ప్రజా జ్యోతి) :** నల్గొండ మండలం మేళ్ల దుప్పలపల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంధ్యారాణి నరసింహారెడ్డి , ఉపసర్పంచ్ మణిమద్దె అనూష, పంచాయతీ కార్యదర్శి ధరణి తో కలిసి వార్డు సభ్యుడు, బీజేపీ నల్గొండ మండల అధ్యక్షుడు బోగరి అనిల్ కుమార్ అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా బోగరి అనిల్ కుమార్ మాట్లాడుతూ..ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తాతా మధు దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలి



**నకిరేకల్, సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి :** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం నకిరేకల్ మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాతా మధు చేసిన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని అన్నారు. ఈ వ్యాఖ్యలకు తాతా మధు వెంటనే దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు దైద రవీందర్ తెలిపారు.

## గణేష్ ఉత్సవాల్లో డీజేలకు బ్రేక్!

- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవు
- డీజే యజమానులకు చివ్వెంల ఎస్సై హెచ్చరిక



**చివ్వెంల సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి) :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల వేళ డీజేల వినియోగంపై పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నారు. గణేష్ ఉత్సవాలు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాల్లో డీజే సిస్టమ్‌లను వినియోగించరాదని చివ్వెంల ఎస్సై స్పష్టం చేశారు.ఈ మేరకు పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీజే సిస్టమ్ యజమానులతో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉత్సవ కమిటీలు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలకు డీజే సిస్టమ్‌లను అద్దెకు ఇవ్వడం, సరఫరా చేయడం లేదా వినియోగించడం చేయరాదని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డీజేలను ఏర్పాటు చేసినా, సరఫరా చేసినా సంబంధిత వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలను పాటించేలా పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీజే యజమానులందరినీ బౌండ్‌ఓవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు,భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.

## ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ వినతి







**నకిరేకల్, సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా, కౌలు రైతులకు సహాయం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యానిధి, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపు, పెన్షన్లు తదితర హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులపై పోలీసు కేసులు పెట్టి నిరసనలను అణచివేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కును, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కాపాడాలని అంబేద్కర్ విగ్రహం సాక్షిగా విజ్ఞప్తి చేశారు. ప్రజల గొంతును అణచివేయకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

## అంగన్‌వాడీ పోస్టుల తాత్కాలిక జాబితా విడుదల


**– అభ్యంతరాల స్వీకరణకు మూడు రోజుల గడువు**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి) :** సూర్యాపేట జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఏ డబ్ల్యు టి), అంగన్‌వాడీ ఆయా (ఏ డబ్ల్యు హెచ్) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా తాత్కాలిక ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి తెలిపారు.జిల్లాలోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయా పోస్టులకు వచ్చిన దరఖాస్తులపై ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసిన అనంతరం అర్హులైన,అనర్హులైన అభ్యర్థుల తాత్కాలిక జాబితాను సిద్ధం చేశారు.ఈ జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీ,మున్సిపాలిటీ పరిధిలోని వార్డు కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై ప్రదర్శించినట్లు పేర్కొన్నారు.

**అభ్యంతరాలకు 3 రోజుల గడువు :** తాత్కాలిక జాబితాపై అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు 09-09-2026 నుంచి 11-09-2026 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సీడీపీఓ కార్యాలయంలో రాతపూర్వక దరఖాస్తుతో పాటు అవసరమైన ఆధారాలను సమర్పించాలని అధికారులు సూచించారు.గడువు ముగిసిన అనంతరం అందే అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు.అభ్యంతరాల పరిశీలన అనంతరం అర్హత నిబంధనల ప్రకారం తదుపరి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.అర్హత ఉన్న అభ్యర్థులు తాత్కాలిక జాబితాను పరిశీలించి,తమకు సంబంధించిన వివరాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోపు ఆధారాలతో సమర్పించాలని అధికారులు సూచించారు.

## 104 గ్రాముల గంజాయి స్వాధీనం

**– ఇద్దరు యువకులు అరెస్ట్ – సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్**



**ఆత్మకూర్ (ఎస్),సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి) :** గంజాయిని అక్రమంగా కలిగి ఉన్న ఇద్దరు యువకులను ఆత్మకూరు (ఎస్) పోలీసులు అరెస్ట్ చేశారు.వారి వద్ద నుంచి 104 గ్రాముల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు,ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటన సూర్యాపేట రూరల్ సర్కిల్ పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో చోటుచేసుకుంది.సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు ఆత్మకూరు (ఎస్) పోలీసులు రామన్నగూడెం గ్రామంలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా గంజాయితో పట్టుబడిన అదే గ్రామానికి చెందిన అల్లిపురి అఖిల్ (23), మట్టపల్లి గంగరాజు (22)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 104 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి,అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.ఈ మేరకు బుధవారం సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో అరెస్ట్ వివరాలను వెల్లడించారు. **మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి :** యువత గంజాయి,ఇతర మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సీఐ రాజశేఖర్ సూచించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, చదువు, ఉద్యోగం, క్రీడలు వంటి సానుకూల మార్గాల్లో ముందుకు సాగాలని కోరారు.గంజాయి,డ్రగ్స్ విక్రయాలు,వినియోగంపై పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తోందని,అక్రమ రవాణా,విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు (ఎస్) ఎస్సై ఐలయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అవమానించడం దుర్మార్గం

**– మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు**

**– బిఆర్ఎస్ నిరసన, ర్యాలీ**





**మిర్యాలగూడ, సెప్టెంబర్ 08, (ప్రజాజ్యోతి) :** తెలంగాణ అసెంబ్లీలో బి ఆర్ ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పాటు శాసన మండలి సభ్యులనుఅవమానించేలా వ్యవహరించిన తీరును నిరసిస్తూ మిర్యాలగూడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు.స్థానిక పార్టీ కార్యాలయంలో మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశమై అసెంబ్లీలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి సాగర్ రోడ్డులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ విగ్రహానికి వినతిపత్రంసమర్పించారు. ఈ సందర్భంగా నాయకులుమాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు అసెంబ్లీకి వెళ్లిన మహిళాప్రజాప్రతినిధులను అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. మహిళలను గౌరవిస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం, తన చర్యల ద్వారా మహిళా ప్రజాప్రతినిధుల పట్ల తన వైఖరిని బయటపెట్టిందని విమర్శించారు.మహిళా ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలకు జరిగిన అవమానంపై ప్రభుత్వం వెంటనే స్పందించి క్షమాపణ చెప్పాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మహిళలఆత్మగౌరవాన్ని కాపాడే వరకుబి ఆర్ ఎస్ పార్టీ మహిళా విభాగం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దుర్గంపూడినారాయణరెడ్డి, ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, అన్నభీమోజు నాగార్జున చారి,పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదయ్య యాదవ్, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఎండి ఇలియాస్ ఖాన్, పెద్ది శ్రీనివాస్ గౌడ్,చౌగని బిక్షం గౌడ్, పెండ్యాల పద్మావతి, ధూళిపాల కళావతి, కుర్ర చైతన్య, సహనాజ్ బేగం, రూక్షాన, పెరుమాళ్ళ ధనమ్మ, చిత్రం ఉమా, కోదాటి రమ, బాణావత్ లలితా, దీపిక, గుడిశ జానకమ్మ, సందేశ్ రజిని, నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట







**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08 (ప్రజా జ్యోతి) :** సూర్యాపేట పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనతో పాటు పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి మున్సిపల్ కౌన్సిల్ పెద్దపీట వేసింది.

మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

**120 మంది కార్మికుల పీఎఫ్‌కు పరిష్కారం :** పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి సంబంధించి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.గత 4 సంవత్సరాల 9 నెలలుగా పీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్న 120 మంది పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని పరిరక్షించేందుకు మున్సిపాలిటీ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి సంవత్సరం అందించే సబ్బులు, దుస్తులు, కొబ్బరి నూనె తదితర సంక్షేమ సామగ్రిని అందించాలని కార్మికులు ఇటీవల చైర్‌పర్సన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

కార్మికుల విజ్ఞప్తిపై స్పందించిన చైర్‌పర్సన్ ఈ

**– 4 ఏళ్ల 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న 120 మంది కార్మికుల పీఎఫ్ చెల్లింపులకు నిర్ణయం**

**– సూర్యాపేట కొత్త మాస్టర్ ప్లాన్‌కు మున్సిపల్ జనరల్ బాడీ ఆమోదం**

**– 60 ఫీట్ల రోడ్డు నుంచి కలెక్టరేట్‌కు అనుసంధాన రహదారిపై కీలక నిర్ణయం**

అంశాన్ని జనరల్ బాడీ ఎజెండాలో పొందుపరచగా, కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

**కొత్త మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం :** సూర్యాపేట పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్‌కు జనరల్ బాడీ ఆమోదం తెలిపింది. పట్టణ విస్తరణ, రహదారులు, మౌలిక వసతులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రూపొందించిన మాస్టర్ ప్లాన్ భవిష్యత్ పట్టణ అభివృద్ధికి దోహదపడుతుందని సమావేశంలో పేర్కొన్నారు.

**కలెక్టరేట్‌కు అనుసంధాన రహదారి :** సూర్యాపేట లోని 60 ఫీట్ల రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు అనుసంధాన రహదారి ఏర్పాటు అంశంపై సమావేశంలో చర్చించారు.ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి అందించాలని నిర్ణయించారు.ఈ రహదారి పూర్తయితే పట్టణ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు కలెక్టరేట్‌కు చేరుకునే మార్గం మెరుగుపడుతుందని తెలిపారు.

**అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు వేగవంతం :** పట్టణంలో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది.పనులను వేగవంతం చేసి,నిర్మాణ పనుల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వీలై నంత త్వరగా తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్‌తో పాటు కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణ ప్రజల అవసరాలు, కార్మికుల సంక్షేమం, సూర్యాపేట భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కౌన్సిల్ సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటోందని చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది తెలిపారు. సూర్యాపేటను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

## ప్రజా పాలనా..? ఎమర్జెన్సీ పాలనా..? కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై

**దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం**



**దేవరకొండ, సెప్టెంబర్ 08, (ప్రజా జ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసుల తీరుపై దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అక్రమంగా హౌస్ అరెస్టులు చేస్తూ.. మరోవైపు ప్రతిపక్ష నేత కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వైపు దాడికి వెళ్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు.అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గౌరారం వద్ద ఎందుకు కాపు కాస్తున్నారని, కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఏం పని అని రమావత్ రవీంద్ర కుమార్ ప్రశ్నించారు. కవ్వంపల్లి సత్యనారాయణను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని నిలదీశారు.కేసీఆర్ పై దాడికి కంటైనర్లలో ఎమ్మెల్యేలు, కార్యకర్తలను తరలిస్తున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష నేత ఇంటిపై దాడికి ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హింసను ప్రేరేపిస్తున్నారా అని నిలదీశారు.ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను హౌస్ అరెస్టులు చేయడం, అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలను మాత్రం స్వేచ్ఛగా వదిలేయడం ఏ విధమైన ప్రజాస్వామ్యమని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల నిరసనకు ఒక న్యాయం, అధికార పార్టీకి మరో న్యాయమా అని మండిపడ్డారు.ముఖ్యమంత్రి డైరెక్షన్‌లోనే కేసీఆర్ పై దాడికి కుట్ర జరుగుతోందని రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు. హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో శాంతిభద్రతలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా పాలన ముసుగులో పోలీసుల రాజ్యం నడుస్తోందని ధ్వజమెత్తారు.కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వద్ద జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతపై దాడికి కుట్ర జరుగుతున్నా ప్రభుత్వం, పోలీసులు పట్టించుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమన్నారు.అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా వ్యవహరించడం మానుకోవాలని రమావత్ రవీంద్ర కుమార్ హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసుల ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

## ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై బిఆర్ఎస్ పోరుబాట మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్







**– మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల దుర్మార్గపు ప్రవర్తనను సహించేది లేదు**

**– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి.**

**– నల్గొండలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు, వినతిపత్రం సమర్పణ**

**దేవరకొండ, సెప్టెంబర్ 08,( ప్రజా జ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలపై భారత రాష్ట్ర సమితి అధిష్టానం పిలుపు మేరకు చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ నల్గొండలో మీడియా సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై మరియు పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీ ప్రాంగణంలో మరియు నిరసనల సందర్భంలో బిఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. “మహిళా శాసనసభా నాయకుల చీరెలు లాగుతారా? మా పట్ల ఇంత దుర్మార్గంగా ప్రవర్తిస్తారా?” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.బిఆర్ఎస్ మహిళా నాయకురాలు సునితమ్మ చీర లాగిన పోలీసులను, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీసులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రజాప్రతినిధులకు జరిగిన ఈ అవమానానికి గానూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 అబద్ధపు హామీలపై నిరసనగా రమావత్ రవీంద్ర కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగవత్ మరియు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు సిఐటియ

**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్. 8** ఇందల్వాయి మండల ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తీసుకోవడానికి ఇచ్చిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనకుండా జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలో అక్రమంగా అర్ధరాత్రి నుంచి మహిళలని కూడా చూడకుండా అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్ లో





నిర్బంధించారు సరైనది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు అక్రమ అరెస్టులను ఖండించారు. అనంతరం ఆయా డిచ్పల్లి మరియు ఇందల్వాయి పోలీస్ స్టేషన్లో ఉన్న ఆశా వర్కర్లను పరామర్శించి విడుదల చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కన్నా ముందు కాంగ్రెస్ పార్టీ ఆశా వర్కర్లకు నెలకు 18000 రూపాయల వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చి 33 నెలలవుతుందని అధికారుల్లోకి వచ్చి ఇంతవరకు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం పై దృష్టి పెట్టకపోవడంతో గత్యంతరం లేక చలో హైదరాబాద్కు పిలుపునివ్వడం జరిగిందని శాంతియుతంగా హైదరాబాద్ వెళ్లి తమ సమస్యలు చెప్పుకోటానికి సిద్ధపడ్డ ఆశా వర్కర్లను పోలీస్ స్టేషన్లో నిర్బంధించి గొంతు నొక్కాలని చూడటం ఏ విధంగా ప్రజాపాలన అవుతుందని ఆయన అన్నారు ప్రభుత్వం మాటలు దాటుతున్నాయి తప్ప ఆశ వర్కర్ల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని విమర్శించారు ఇప్పటికైనా ప్రభుత్వం ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని అక్రమ అరెస్టులను నిర్బంధాన్ని విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు స్వప్న గంగుబాయి పద్మ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల ఉపాధ్యక్షులు చేతుల మీదుగా యూనిఫాం పంపిణీ

**ఇందల్వాయి, సెప్టెంబర్ 08 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని జి కే తండా గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధి, సౌకర్యం కోసం ఉచితంగా విద్యా సామగ్రి మరియు యూనిఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు యాజమాన్య కమిటీ ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరీష, మహిపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన

**ముప్కాల్ ప్రజాజోతి, సెప్టెంబర్ 8** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె. శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా అసెంబ్లీ గేటు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన అసెంబ్లీ స్పీకర్ పదవిని గౌరవించాలని, అనుచిత వ్యాఖ్యలు చేయడం



సరికాదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికే రెండు పడక గదులు ఇవ్వాలి

- రాజకీయాలకు తావులేకుండా నిజమైన నిరుపేదలను ఎంపిక చేయాలి
- తహసీల్దార్‌కు సర్పంచ్ ధర్మతేజ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారుల వినతి



**బీర్కూర్, ప్రజాజ్యోతి, సెప్టెంబర్ 8:** బీర్కూర్ మండల కేంద్రంలో నిర్మించి నాలుగేళ్లు గడుస్తున్న రెండు పడక గదుల ఇళ్లను అర్హులైన నిరుపేదలకు వెంటనే కేటాయించాలని గ్రామ సర్పంచ్ ధర్మతేజ డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేకుండా, వాస్తవంగా ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి మాత్రమే ఇళ్లను అందించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ సవాయి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. బీర్కూర్ మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు చాలాకాలంగా పంపిణీకి నోచుకోకుండా ఉన్నాయని, దీంతో అర్హులైన లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని సర్పంచ్ ధర్మతేజ పేర్కొన్నారు. ఇళ్ల కేటాయింపును డ్రా పద్ధతిలో చేపట్టనున్నట్లు తెలుసుకున్న అర్హులైన లబ్ధిదారులతో కలిసి ఆయన ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సవాయి సింగ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన సర్పంచ్ ధర్మతేజ, నిజంగా ఇళ్లు లేని కుటుంబాల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, అర్హత కలిగిన వారికే రెండు పడక గదుల ఇళ్లను కేటాయించాలని కోరారు. కేవలం డ్రా పద్ధతిలో కాకుండా, లబ్ధిదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ ఒత్తిళ్లు, సిఫారసులకు అవకాశం లేకుండా అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఇల్లు లేని కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ గృహాల కోసం ఎదురుచూస్తున్నాయని, అలాంటి వారికి ఇళ్లు దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సవాయి సింగ్ మాట్లాడుతూ.. లబ్ధిదారుల అర్హతలను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులైన వారికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎలాంటి అన్యాయం జరగకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తహసీల్దార్ హామీ ఇవ్వడంతో సర్పంచ్ ధర్మతేజ ఆధ్వర్యంలో తరలివచ్చిన అర్హులైన లబ్ధిదారులు శాంతించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కావాలంటే దీనికి ఇంకా పవర్‌ఫుల్ రాజకీయ హెడ్డింగ్‌లతో లేదా ప్రజా సమస్య కోణంలో మరింత ఘాటైన పత్రికా కథనంగా కూడా మార్చవచ్చు.

## మల్లాపూర్‌లో రీ-సర్వేను పరిశీలించిన తహసీల్దార్





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్. 9** ఇందల్వాయి: మండల కేంద్రంలోని మల్లాపూర్ గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ బాలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మూడేడ్ల సువర్ణకు చెందిన పట్టా భూమిని అధికారులు సర్వే చేశారు. సువర్ణకు చెందిన పట్టా భూమి హద్దులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఆమె భూమిలో నుంచి పక్కవారికి గానీ, ఇతరులకు గానీ ఎలాంటి భూమి వెళ్లకుండా హద్దులను గుర్తిస్తూ సర్వే నిర్వహించారు. భూ యజమానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, రికార్డుల ప్రకారం భూమి హద్దులను స్పష్టంగా నిర్ధారించేలా అధికారులు చర్యలు చేపట్టారు. రీ-సర్వే ద్వారా భూముల హద్దులు స్పష్టమవడంతో భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే సుప్రియ, అసిస్టెంట్ డైరెక్టర్ శశికుమార్, నితిన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## జీఓ 97 రద్దు కోసం రోడ్డెక్కిన నర్సింగ్ విద్యార్థులు

- అందోలులో ఎన్‌హెచ్-161పై రాస్తారోకో
- విద్యార్థులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్
- 'వీ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు
- కిలోమీటర్ మేర స్తంభించిన ట్రాఫిక్

**అందోలు, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):** జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అందోలులో నర్సింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం రోడ్డెక్కారు. కళాశాల ఎదుట జాతీయ రహదారి-161పై పెద్ద సంఖ్యలో విద్యార్థులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సుమారు అరగంట పాటు కొనసాగిన ఆందోళనతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయి, సుమారు కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే మద్దతు**

విద్యార్థులు రాస్తారోకో చేస్తున్న సమయంలో అటుగా వెళ్తున్న అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అక్కడ ఆగి వారి ఆందోళనకు మద్దతు ప్రకటించారు. విద్యార్థులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసనలో పాల్గొన్నారు. 'వీ వాంట్ జస్టిస్.. జీఓ 97 వెంటనే రద్దు చేయాలి' అంటూ విద్యార్థులు నినాదాలు చేయగా, క్రాంతి కిరణ్ సైతం వారితో గొంతు కలిపారు. దీంతో







కొద్దిసేపు జాతీయ రహదారిపై ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**జీఓ 97 రద్దు చేయాలి**

ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా ఉన్న జీఓ 97ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నర్సింగ్ విద్యార్థుల సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించి, వారి విద్యా భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. ఈ ప్రాంతానికి చెందిన విద్యావంతుడైన మంత్రి దామోదర రాజనర్సింహ విద్యార్థుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, జీఓ రద్దు కోసం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడి ప్రభుత్వానికి వారి సమస్యను తెలియజేస్తామని తెలిపారు.

**ర్యాలీకి అనుమతి ఇవ్వాలని డిమాండ్**

జాతీయ రహదారిపై విద్యార్థులు బైఠాయించడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. దీంతో రాస్తారోకోను విరమించాలని పలువురు ప్రయాణికులు విద్యార్థులను కోరారు. అయితే తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని, అప్పటివరకు ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ స్పందిస్తూ.. ర్యాలీ నిర్వహణకు అవసరమైన అనుమతులు తీసుకునేందుకు సహకరిస్తామని, అనుమతి లభించిన అనంతరం విద్యార్థులకు మద్దతుగా తాము కూడా ర్యాలీలో పాల్గొంటామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు రాస్తారోకోను విరమించారు. జీఓ 97 రద్దు కోసం నర్సింగ్ విద్యార్థులు జాతీయ రహదారిపై చేపట్టిన ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే మద్దతు ఇవ్వడం, ర్యాలీకి అనుమతి కోసం డిమాండ్ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

## మల్లయ్య కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక భరోసా



**అందోల్, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):** మక్తగూడెం గ్రామానికి చెందిన కొడూరి మల్లయ్య అకాల మరణంతో విషాదంలో ఉన్న కుటుంబానికి గ్రామ సర్పంచ్ వొగ్గ సాయికిరణ్ ఆర్థిక భరోసా కల్పించారు. కుటుంబానికి అండగా నిలిచేందుకు తన తరపున రూ.5,000 ఆర్థిక సహాయాన్ని 10వ వార్డు సభ్యుడు విష్ణు ద్వారా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం సామాజిక బాధ్యత అని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్, వొగ్గు దేవయ్య, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## కనీస వేతన బోర్డు నుంచి సీఐటీయూను తప్పించడం దుర్మార్గం

- కార్మికుల హక్కులను హరించే కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొడతాం: ఎర్రోళ్ల మహేష్



**వట్టిపల్లి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):** సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలశీకేంద్ర కనీస వేతన సలహా బోర్డు నుంచి సీఐటీయూను మినహాయించడాన్ని నిరసిస్తూ వట్టిపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కామ్రేడ్ ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ ప్రధాన కార్మిక సంఘాలకు బోర్డులో ప్రాతినిధ్యం కల్పించకపోవడం అప్రజాస్వామికమన్నారు. పెరుగుతున్న నిత్యావసరాలు, విద్య, వైద్యం, ఇంధన ధరలకు అనుగుణంగా కార్మికులకు గౌరవప్రదమైన కనీస వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పిస్తూ కార్మికుల హక్కులను హరించడం సరికాదన్నారు. సీఐటీయూను బోర్డు నుంచి తప్పించినా కార్మికుల హక్కుల కోసం పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు మహేష్, జనార్ధన్, దాసు, నరేందర్ గౌడ్, సంపత్, కుమార్, గాలయ్య, వీరారెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి
- లస కార్మికుల వివరాల పూర్తిగా నమోదు చేయాలి
- శేరి లింగంపల్లి జోన్ డిసిపి శ్రీనివాస్



**జిన్నారం (ప్రజాజ్యోతి)** పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నేరాల నియంత్రణకు పరిశ్రమల యాజమాన్యాలు పోలీసులకు సహకరించాలని శేరిలింగంపల్లి జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ సూచించారు. మంగళవారం బొల్లారం ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరిశ్రమల్లో భద్రతా చర్యలు, సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి నిరంతర పర్యవేక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. పరిశ్రమల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పరిశ్రమలో పనిచేస్తున్న వలస కార్మికుల వ్యక్తిగత వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేసుకోవడంతోపాటు, వారి పూర్వ చరిత్ర (యాంటిసిడెంట్స్)ను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని స్పష్టం చేశారు. ఉద్యోగంలో చేరే సమయంలోనే కార్మికుల వివరాలు, గుర్తింపు పత్రాలు పరిశీలించి రికార్డుల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. పరిశ్రమల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, వాటి ద్వారా పరిసరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీసీపీ పేర్కొన్నారు. సీసీ కెమెరాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా అవసరమైన చోట అదనపు కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల భద్రతకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఐడీఏ బొల్లారం సీఐ వి. సుధీర్‌కుమార్, బొల్లారం ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌రావు, కార్యదర్శి రాయుడు,రాజు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



## రామాయంపేట సీహెచ్‌సీలో
# ఆరోగ్య సేవలపై డీసీహెచ్ఎస్ పరిశీలన

**మెదక్ (ప్రజా జ్యోతి)** మెదక్ జిల్లాలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తోందని డీసీహెచ్ఎస్ డాక్టర్ శివ దయాల్ తెలిపారు.మంగళవారం రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను డీసీహెచ్ఎస్ డాక్టర్ శివ దయాల్








సందర్శించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలు, రోగుల పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వివిధ విభాగాల వైద్య నిపుణుల సేవలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ దయాల్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తోందన్నారు. డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ గణేశ్వర్ జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను నిరంతరం సందర్శిస్తూ రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారని తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్య నిపుణులు వృత్తిపట్ల క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ ప్రాంతంలోనైనా ప్రజలు తీవ్రమైన జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వ్యాధి తీవ్రతకు అనుగుణంగా చికిత్స అందించాలని డీసీహెచ్ఎస్ సూచించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు, వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించాలి: అదనపు కలెక్టర్ నగేష్ పిలుపు

**మెదక్ (ప్రజాజ్యోతి)** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. 'భక్తి భావంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి' వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ) విగ్రహాలకు బదులుగా మట్టి, సహజ రంగులతో తయారైన పర్యావరణహిత వినాయక విగ్రహాలనే ప్రతిష్టించాలని మెదక్ జిల్లా అదనపు





కలెక్టర్ నగేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా పరిపాలన సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాల గోడపత్రికలను (పోస్టర్లను) అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారి మాధురి, హౌసింగ్ పీడీ మాణిక్యం, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీని భర్తరఫ్ చేయాలి

★ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య

**తొగుట, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకొని వెంటనే ఆయనను ఎమ్మెల్సీ పదవి నుండి భర్త రఫ్ చేయాలని మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య డిమాండ్ చేశారు. తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామంలో మంగళవారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య మీడియాతో మాట్లాడుతూ సోమవారం అసెంబ్లీ ప్రాంగణం ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీని వెంటనే భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ ను ఎమ్మెల్సీ హోదాలో ఉ ండి అన్ పార్లమెంటరీ వాక్యాలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇప్పటికైనా ఎమ్మెల్సీ



తాతా మధు చేసిన తప్పును ఒప్పుకొని వెంటనే బేషరతుగా బహిరంగంగా స్పీకర్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు ఎవరు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మృతురాలి కుటుంబానికి
# 50 కిలోల అందజేసిన పండు ఫౌండేషన్



**తొగుట, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):** నిరుపేదలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి కలుగుతుందని ముందుకు సాగుతున్న పండు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ సామాజికవేత్త చిక్కుడు స్వామి ముదిరాజ్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తుక్కాపూర్ గ్రామానికి చెందిన చిక్కుడు పెద్దలు రాజవ్వ ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందగా, విషయం తెలుసుకున్న పండు ఫౌండేషన్ అధ్యక్షులు చిక్కుడు స్వామి ముదిరాజ్ వెంటనే స్పందించి, బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని మంగళవారం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజవ్వ మరణం చాలా బాధాకరమని, వారి కుటుంబానికి ఇది తీరని లోటని అన్నారు. కష్టకాలంలో ఉన్న ప్రతి కుటుంబానికి పండు ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. రాజవ్వ కుటుంబ సభ్యులు పండు ఫౌండేషన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు సభ్యుడు గొడుగు శ్రీశైలం ముదిరాజ్, 3వ వార్డు సభ్యుడు చిక్కుడు సాయిరాజ్, అయిదవ వార్డు సభ్యుడు లింగాల మహేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చిక్కుడు గోపాల్ ముదిరాజ్, చిక్కుడు కనకయ్య, చిక్కుడు స్వామి ముదిరాజ్, చిక్కుడు జగన్నాథం, మహమ్మద్ షఫీ, బ్రెంకల బాలరాజు, చిక్కుడు దుర్గయ్య, చిక్కుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# దళితులు అంటే బిఆర్ఎస్ పార్టీకి ఇంత చులకనా

★ ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు లింగాల కృష్ణ మాదిగ

★ స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్సీ తాత మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి

**తొగుట, సెప్టెంబర్ 08(ప్రజాజ్యోతి):** దళితులు అంటే బిఆర్ఎస్ పార్టీ నాయకులకు ఎందుకంత చులకన భావం అని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు లింగాల కృష్ణ మాదిగ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దౌర్జన్యంగా వ్యవహరించడమే కాకుండా, గౌరవప్రదమైన రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు ఉ పయోగించినట్లు ప్రచారంలో ఉన్న అసభ్యకరమైన, అవమానకరమైన పదజాలాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్పీకర్‌ను ఉద్దేశించి పరుష పదజాలం (పేపర్లో రాయలేని విధంగా) అంటూ మాట్లాడినట్లు వస్తున్న వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమైనవని పేర్కొన్నారు. ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా గౌరవప్రదమైన రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న వ్యక్తిని ఇలాంటి భాషతో సంబోధించడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. గత పది సంవత్సరాలు మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపట్టిన ప్రతిపక్ష నాయకులను పోలీసులు వారి విధుల్లో భాగంగా అడ్డుకోలేదా, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న నాయకులు కూడా ఇలాంటి అసభ్యకరమైన, దిగజారుడు భాషను ఉపయోగించారా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదాలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేయడం, ధర్నాలు చేపట్టడం మీ హక్కు కానీ ఆ పేరుతో ఒక గౌరవప్రదమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్‌ను పరుష పదజాలం వాడుతూ కించపరిచే విధంగా మాట్లాడే హక్కు బిఆర్ఎస్ నాయకులకు ఎవరు ఇచ్చారని నిలదీశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు స్థానం ఉ ంటుందని, అధికార పక్షాన్ని ప్రశ్నించవచ్చుని, ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించవచ్చని, నిరసనలు చేపట్టవచ్చుని, రాజకీయ ఆవేశంలో హద్దులు దాటి దళిత సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే దళిత సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ తాత మధు చేసినట్లు ఆరోపించబడుతున్న వ్యాఖ్యలను సంబంధిత అధికారులు పరిశీలించి, అవి చట్టపరంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం పరిధిలోకి వస్తాయని తేలితే వెంటనే కేసు నమోదు చేసి చట్టప్రకారం అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ వ్యవహారంపై స్పందించాలని కోరుతున్నామన్నారు. దళిత స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన పదజాలం ఉపయోగించి దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ తాత మధుపై పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దళితుల గౌరవాన్ని కించపరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు.



# ఎమ్మెల్సీ దిష్టిబొమ్మ దహనం

**నంగునూర్ సెప్టెంబర్8(ప్రజా జ్యోతి):** అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం నాడు నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండలంలోని రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాతా మధుసూదన్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ





సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవులకు, వాటిలో ఉన్న వ్యక్తులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి స్పీకర్‌పై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు తాత మధుసూదన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపోల్. రాజ్ బహదూర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ రంగు అశోక్, ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ ఏఎంసి డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్, గొట్టం రంగారెడ్డి, తిప్పని రాజేశ్వర్, జీవన్ నాయక్,ప్రభాకర్,చేర్యాల కృష్ణా, పాక్స్ డైరెక్టర్ కరెడ్ల వెంకట్ రెడ్డి, కాటం. కనకయ్య, వల్లద్రి రవీందర్ రెడ్డి పదిరే శ్యామ్ రెడ్డి,పిల్లి మహేష్, బ్రె సంతోష్ రెడ్డి,బోజు రాములు, గడ్డం కరుణాకర్ రెడ్డి,నాయిని సంపత్ రెడ్డి, మాదే మహేష్ జిన్నా సంపత్ రెడ్డి నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ పై చర్యలు తీసుకోవాలి



**నంగునూర్ సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):-** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు మరణాన్ని కోరుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ పై కేసు నమోదు చేసి చట్టాపరంగా చర్యలు తీసుకోవాలని మంగళవారం నాడు మండల పరిధిలోని రాజగోపాల్పేట పోలీస్ స్టేషన్లో బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు లింగం గౌడ్ బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ఉండి తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చావును కోరుకున్న ఎమ్మెల్యే పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కోల రమేష్ గౌడ్ మాజీ ఎంపిటిసి బెదురు తిరుపతి ల తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# యూజీసీ -నెట్ పరీక్షకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

★ జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, సెప్టెంబర్ 8 ,(ప్రజాజ్యోతి):** సెప్టెంబర్ 9, 10 తేదీలలో నిర్వహించనున్న యూజీసీ -నెట్ జాతీయ అర్హత పరీక్షను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు బి ఎన్ ఎస్ ఎస్ --2023లోని సెక్షన్ 163 కింద ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ లో సెప్టెంబర్ 9, 10 తేదీలలో యూజీసీ -నెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షకు సంబంధించి భద్రతా ఏర్పాట్లతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.పరీక్ష సజావుగా, ప్రశాంతంగా, క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, పరీక్ష నిర్వహణలో ప్రజలు ఉద్దేశపూర్వకంగా జోక్యం చేసుకోకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు అమల్లో ఉంటాయని



తెలిపారు.ఈ ఆంక్షలు సెప్టెంబర్ 9, 10 తేదీలలో ఉ దయం 6 గంటల నుంచి సాయంత్రం 7:30 గంటల వరకు ,పరీక్ష పూర్తయ్యే వరకు అమల్లో ఉంటాయని కలెక్టర్తెలిపారు.యూజీసీ -నెట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు, విద్యార్థులు, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఆంక్షలకు సహకరించాలని ఆమె కోరారు.

## గ్రామ అభివృద్ధికి
# సర్పంచ్ లే పట్టుకొమ్మలు

★ ఎంపీ నిధుల నుండి గ్రామాలకు ప్రత్యేక నిధులు

★ సర్వసభ్య సమావేశాలకు ప్రజాప్రతినిధులు అధికారులు తప్పక హాజరు కావాలి

★ మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు





**దుబ్బాక ప్రతినిధి సెప్టెంబర్ 08 (ప్రజా జ్యోతి)** గ్రామాలలో సర్పంచులు అధికారులు సమన్వయంతో కలిసి పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అన్నారు. మంగళవారం రోజున దుబ్బాక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లలిత కుమారి ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అధికారులు గ్రామ సర్పంచులు ఒకే తాటిపై నడిచే గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఆయా శాఖ అధికారులకు త్వరగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను హెచ్చరించారు. అంతేకాకుండా ప్రతి గ్రామ అభివృద్ధికి తనవంతుగా ఎంపీ సహాయ నిధి నుండి ప్రత్యేక నిధులు కూడా ఇస్తానని సర్పంచులకు హామీ ఇచ్చారు. అధికారులు కలిసికట్టుగా పనిచేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అధికారులతో ప్రజాపతి సామర సంఘం మాట్లాడి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు. సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి అధికారులకు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకొని వ్యవసాయ శాఖ అధికారికి దుబ్బాక మండలంలోని ప్రతి సర్పంచ్లకు యాప్ ను పంపించి గ్రామంలో ప్రతి రైతుకు యూరియా సరఫరా కృషి చేయాలని తెలిపారు. విద్యుత్ అధికారులు కూడా రైతుల కోసం 12 గంటల పాటు కరెంటును అందించాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అలాగే దుబ్బాక కేసీఆర్ స్కూల్లో విద్యార్థులు చాలా తక్కువగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, వెంటనే వచ్చే అకాడమీ వరకు విద్యార్థుల ఎక్కువ శాతం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా మండల విద్యాధికారి కృషి చేయాలని వారికి సూచించారు. గ్రామాలలో విద్యా వైద్యం పట్ల ప్రతి ఒక్క అధికారి తప్పనిసరిగా వారంలో రెండు లేదా మూడు రోజులపాటు కలియ తిరుగుతూ గ్రామ సమస్యలను పరిష్కరించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా గ్రామాల సర్పంచ్లకు రావాల్సిన పెండింగ్ బిల్స్ త్వరలోనే ప్రభుత్వంతో మాట్లాడి విడుదల చేపిస్తానని సర్పంచ్లకు హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దేవరాజ్ ఎంపీ రఘునందన్ రావుకు శాలువాతో సన్మానించి గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం నుండి నిధులు ఎలా మంజూరు చేసుకోవాలి ఏ స్కీంల నుండి పంచాతీలకు నిధులు వస్తాయని ప్రతిది మీకు తెలుస్తుందన్నారు. తప్పకుండ ప్రతి ప్రజా ప్రతినిధి సమావేశాలకు హాజరు కావాలన్నారు. గ్రామాలు అభివృద్ధి జరగాలంటే సర్పంచులకు అధికారులు సహకరించాలని తెలిపారు. అధికారులు సహకరిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సర్పంచులు కష్టపడి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యం అన్నారు. ప్రభుత్వం నుండి మంజూరవుతున్న అన్ని స్కీంలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో విద్యకు పెద్ద పీఠ వేయాలని చెప్పారు. గ్రామాల్లో చదువులు బాగ లేకుంటే మండల కేంద్రం, ఇక్కడ బాగలేకుంటే జిల్లా కేంద్రంలో అక్కడ కూడా బాగ లేకుంటే పట్టణాలకు ప్రజలు వలసలు పోతున్నారని అన్నారు. ఈ విధానం మంచిది కాదని గ్రామాల్లో విద్యకు మొదటి ప్రాముఖ్యత ఇవ్వాలని పిల్లలు మీ గ్రామాల్లోనే చదువుకోవాలని పట్టణ ప్రాంతాలకు వలసలు పోతే గ్రామాలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వీబీజీ రామ్ జీ పథకంలో 318 పనులు ఉన్నాయి వీటిలో మీ గ్రామాలకు ఏ పని చేసుకుంటే అభివృద్ధి సాధిస్తాయని తెలుసుకొని ఆ పనులు చేపట్టాలని కోరారు. 5సం॥ల్లో మీ గ్రామాలు పట్టణప్రాంతాల మాదిరిగా తయారు అవుతాయన్నారు. కాలుష్యం లేని గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, దుబ్బాక మండల ఆయా గ్రామాల సర్పంచులు, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## తాండూరులో ఘనంగా మాణిక్ రావు వర్ధంతి వేడుకలు





**చిత్రపటానికి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ నాయకుడు విఠల్ రెడ్డి**

**తాండూరు సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో మాజీ మంత్రి యం.మాణిక్ రావ్ వర్ధంతి వేడుకలు పార్టీలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పంజుగుల విఠల్ రెడ్డి చించోల్లి రోడ్డు మార్గంలోని మాణిక్ రావు విగ్రహానికి పూలమాలలు వేసిన తదుపరి అక్కడే ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూల మాలలు చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి దివంగత నేత మాణిక్ రావు భార్య శశి ప్రభ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు విఠల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి దివంగత నేత మాణిక్ రావు 10వ వర్ధంతిని అన్ని రాజకీయ పార్టీల కలయికలో సంయుక్తంగా నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. తాండూరు ప్రజలంటే ఎంతో అభిమానం గా భావించే మాణిక్ రావు ప్రజాదరణ కల్గిన వ్యక్తి అని గుర్తు చేశారు. ఒక వర్గానికి ఒక ప్రాంతానికి చెందిన వ్యక్తిగా కాకుండా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన నాయకుడు తాండూరు ప్రజల గుండెల్లో మంచి స్థానం సంపాదించిన మహనీయుడు మాణిక్ రావును ఎవరు మర్చిపోలేరని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజు గౌడ్, పలువురు కౌన్సిలర్లు, అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.

## విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలి

**– షీ టీం డివిజన్ ఇంచార్జ్ నర్సిములు**




**పరిగి, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):** విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పరిగి సబ్ డివిజన్ షీ టీం ఇంచార్జ్ నర్సిములు అన్నారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలన, మద్యపాన నిషేధం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వంటి సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర సేవల కోసం 112 డయల్, షీ టీం హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 నంబర్ల వినియోగంపై సూచనలు చేశారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రహూఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీ టీం సభ్యులు సావిత్రి, శోభ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఎమ్మెల్యేలపై అసభ్య ప్రవర్తనకు కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన

**– సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలతో పాటు తెలంగాణ మహిళలకు సి.ఎం క్షమాపణ చెప్పాలి**
**– చందానగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళలు కళ్ళకు గంతలు కట్టుకొని వినూత్న ఆందోళన**
**– యావత్ మహిళా లోకానికి సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్**
**– ఎం.ఎల్.ఏల మీద ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డ బొబ్బా నవతారెడ్డి**






**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 08 ప్రజా జ్యోతి :** అసెంబ్లీ సాక్షిగా సీనియర్ మహిళా శాసనసభ్యులు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు, నిరసనగా చందానగర్‌లో మహిళలు కదం తొక్కారు.ప్రభుత్వ తీరుని తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం చందానగర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకురాలు బొబ్బా నవతారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యాయం గుడ్డిది కాదు అని చాటేలా.. కళ్లకు నల్లటి గంతలు కట్టుకుని వినూత్న రీతిలో తమ నిరసన గళాన్ని వినిపించారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

**మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తారా? :** ఈ సందర్భంగా బొబ్బా నవతారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి హోదాలో ఉన్న బాధ్యతాయుతమైన వ్యక్తి.. ఎంతో అనుభవం ఉన్న సీనియర్ మహిళా నేతలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను ఉద్దేశించి అసెంబ్లీలో చులకనగా మాట్లాడటం అత్యంత హేయమైన చర్య. ఇది కేవలం ఆ ఇద్దరు నేతలకు జరిగిన అవమానం కాదు.. యావత్ తెలంగాణ మహిళా లోకానికి జరిగిన అవమానం. మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఏంటో సీఎం ప్రవర్తన తో బట్టబయలైందని ఆమె మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు నిలదీస్తుంటే సహనంతో సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రి, కక్షపూరితంగా వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికే చీకటి రోజని దుయ్యబట్టారు.

**బేషరతుగా క్షమాపణ చెప్పాలి.. :** కళ్లకు గంతలు కట్టుకుని నిలబడిన మహిళల ఆవేదనను ఈ ప్రభుత్వం అర్థం చేసుకోవాలని బొబ్బా నవతారెడ్డి పేర్కొన్నారు.మహిళా నేతలను అవమానించేలా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి తన తప్పును తెలుసుకుని, తక్షణమే బేషరతుగా వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఎవరు మాట్లాడినా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. సీఎం స్పందించి బహిరంగ క్షమాపణ చెప్పకపోతే,రానున్న రోజుల్లో మహిళలందరినీ ఏకతాటిపైకి తెచ్చి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వరలక్ష్మి,శభన,శరీన్, శోభ,రాధ,సీనియర్ నాయకులు కోమండ్ల శ్రీనివాస్ రెడ్డి,శ్రీకాంత్,సంగారెడ్డి, రాజన్న,రామకృష్ణ,గౌడ్,అల్లఉద్దీన్,శివరాజ్,చందర్ రావు,గౌస్,అంజి,శేఖర్,మరియు, స్థానిక మహిళలు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల అరెస్టులపై ఆగ్రహం






**ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులేనా? – బీఆర్ఎస్ నేతల విమర్శ**

**పరిగి, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):** రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకుల అరెస్టులను నిరసిస్తూ పరిగి, దోమ మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాల నేపథ్యంలో పోలీసులు మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా తమ నిరసనను వ్యక్తం చేయకుండా అడ్డుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు తెలియజేయకుండా అడ్డుకోవడానికే ఈ అరెస్టులు చేస్తున్నారని అరెస్టు అయిన బీఆర్ఎస్ పరిగి మండల అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, కౌన్సిలర్, మీర్ తాహేర్ అలీ, బీఆర్ఎస్ యువ నాయకులు బలాల ఆరోపించారు.

సోమవారం తెలంగాణ శాసనసభలో చోటుచేసుకున్న ఘటనలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలకు సిద్ధమవుతున్న సమయంలో ముందస్తు చర్యల పేరుతో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారని వారు తెలిపారు. ముఖ్యంగా మాజీ హోంమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన వ్యవహారాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజల తరపున ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఆ హక్కును హరించే విధంగా అరెస్టులు చేయడం సరికాదన్నారు.

అరెస్టులకు భయపడే పరిస్థితి తమకు లేదని, ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సర్పంచ్ రామచంద్రయ్య, సామ్య నాయక్, సురేందర్ రెడ్డి, ప్రవీణ్‌ను అరెస్టు చేసి పరిగి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## పరిగి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న

# మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి







**పరిగి, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి) :** బీఆర్ఎస్ పార్టీ నాయకుల అరెస్టుల నేపథ్యంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పరిగి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.

ఈ క్రమంలో చెంగోముల్, దోమ, కుల్కచర్ల పోలీస్ స్టేషన్ల ఎస్సైలతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. అనంతరం పరిగి పోలీసులతో మాట్లాడిన కొప్పుల మహేష్ రెడ్డి, అరెస్టయిన పలువురు బీఆర్ఎస్ నాయకుల విడుదల చేయించారు. విడుదలైన వారిలో మండల అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ అరవింద్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్‌తో పాటు పలువురు కౌన్సిలర్ మీర్ తాహేర్ అలీ ఉన్నారు.

ఈ సందర్భంగా కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య బద్ధంగా నిరసనలు తెలిపే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉందని, నాయకుల అరెస్టులు సరైన విధానం కాదని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో అంబేద్కర్ విగ్రహం దగ్గర చేరుకొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ ప్రభుత్వం ప్రజల వ్యతిరేక విధానాల పై అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.

## తాతా మధును సస్పెండ్ చేయాలని

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

**చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాకల్ పల్లి ఎం చంద్రశేఖర్**



**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 08 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిర్వహిస్తూ చౌడాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని పేర్కొన్నారు. తాతా మధు వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం తక్షణమే స్పందించి,ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ అశోక్,మండల ప్రధాన కార్యదర్శి రాము, చౌడాపూర్ సర్పంచులు నర్సింహ నాయక్,నవీన్ కుమార్, మధు, రవి, చెన్నయ్య, తుకారాం, శ్రీను అలాగే కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్, బీసీ సెల్, ఎస్టీ సేల్, మైనార్టీ సెల్ అధ్యక్షులు మన్యంలాలు, నర్సిములు, ఇలియాస్, విభాగాల ప్రతినిధులు దామోదర్ రెడ్డి, వెంకటయ్య, చెన్నయ్యతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు సలీమ్, రాములు, గోపాల్, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, రమేష్, బుచ్చయ్య, మాణికుమార్, మల్లేష్, రాజు, యాదయ్య మరియు సీనియర్ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సామగ్రిలో ఎలాంటి నిర్లక్ష్యానికి

# తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి









**– రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**
**– రాజేంద్రనగర్ లో ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**
**– రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలన**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 08 (ప్రజా జ్యోతి) :** ఎన్నికల సామగ్రిలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మంగళవారం రాజేంద్రనగర్ లోని ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌లో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రి మరియు వాటిని భద్రపరిచిన గదులను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని భద్రంగా భద్రపరుస్తున్న విధానాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు తదితర ఎన్నికల సామగ్రికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్‌లో భద్రపరిచిన యంత్రాల సంఖ్య, వాటి భద్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈవీఎంలు మరియు ఎన్నికల సామగ్రి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోడౌన్ భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, సీల్ విధానం, రిజిస్టర్ల నిర్వహణ వంటి అంశాలను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

అనంతరం ఎన్నికల నిబంధనల ప్రకారం గోడౌన్‌కు తిరిగి సీల్ వేయించారు. అనంతరం రాజేంద్రనగర్ తహసీల్దారు కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. హియరింగ్‌కు హాజరవుతున్న ప్రజలతో మాట్లాడి, వారి దరఖాస్తులు మరియు సమర్పిస్తున్న పత్రాల వివరాలను తెలుసుకున్నారు. హియరింగ్ సమయంలో ప్రజలు అవసరమైన పత్రాలను సక్రమంగా సమర్పించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

హియరింగ్ ప్రక్రియను ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హియరింగ్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారునికి ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జ్ రాములు, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, సంబంధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం మహిళలకు క్షమాపణ చెప్పాలి

**– మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి**
**– సునిత లక్ష్మారెడ్డిలను అవనించడం బాధాకరం**
**– తాండూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దీపా నర్సింలు**




**తాండూరు సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి :** తెలంగాణ అసెంబ్లీ వద్ద మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి,సునీత లక్ష్మారెడ్డి,లను పోలీసులు అడ్డుకుని మహిళలు అని కూడ చూడకుండా అవమానించడం బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ మహిళ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం రోజు తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దీపా నర్సింలు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కోట్రిక విజయలక్ష్మి పలువురు కౌన్సిలర్లు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలందరికీ క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. మహిళలకు జరిగిన అవమానానికి నిరసనగా ప్ల కార్డులలో నిరసన తెలిపారు. అదేవిధంగా మహిళలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ మహిళ నాయకురాలు పాల్గొన్నారు.

## బడికి బాసట.. డిజిటల్ కానుక!

**– రూ.15 వేల విలువైన టీవీ వితరణ**
**– డిజిటల్ బోధనకు దోహదం.. విద్యార్థుల అభివృద్ధే లక్ష్యం**
**– తల్లారం గ్రామ పెద్దలు కురువరాజు**



**చేవెళ్ల, సెప్టెంబరు 8(ప్రజాజ్యోతి) :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ బోధన అందించేందుకు తల్లారం గ్రామ పెద్ద కురువరాజు ముందుకొచ్చారు. చేవెళ్ల మండలం తల్లారం ప్రాథమిక పాఠశాలకు రూ.15 వేల విలువైన టెలివిజన్‌ను వితరణ చేసి ప్రభుత్వ బడి అభివృద్ధికి తనవంతు సహకారం అందించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో టెలివిజన్ ద్వారా విద్యార్థులకు డిజిటల్ తరగతులు, విద్యా సంబంధిత కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకురావచ్చని కురువరాజు తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే ఉద్దేశంతో టీవీని అందజేసినట్లు చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించి, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామ పెద్దలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న శేఖర్ పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అవసరాలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని కురువరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తల్లారం గ్రామ కార్యదర్శి రోషన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంజుల, గ్రామ పెద్ద షాబాద్ సాంబశివుడు, ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయులు కృష్ణయ్య, ప్రీ ప్రైమరీ టీచర్ వసిమా, ఆయా వరలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు రూ.26 వేలు ఇవ్వాల్సిందే హామీలు అమలు చేయాలి

**– చలో హైదరాబాద్.. అసెంబ్లీ ముట్టడి జయప్రదం చేయాలి**
**– సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**



**చేవెళ్ల సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి) :** అంగన్వాడీ ఉద్యోగులకు ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్లకు నెలకు రూ.26 వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారం లోకి వచ్చి మూడేళ్లు గడిచినా హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు చిన్నారుల సంరక్షణ, గర్భిణీలు, బాలింతలకు సేవలు, పోషకాహార పంపిణీ వంటి కీలక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. వారిని కేవలం గౌరవ వేతన ఉద్యోగులుగా కాకుండా కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు, చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కోరారు. టీచర్లకు రూ.26 వేల వేతనం, హెల్పర్లకు తగిన వేతనం, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతోపాటు పెండింగ్ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇతర ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నిధులు పెంచి బలోపేతం చేయాలని, ఉద్యోగులపై అదనపు పనిభారం తగ్గించాలని కోరారు. సెప్టెంబర్ 9న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మంచి రెడ్డి కిషన్ రెడ్డికి స్వాగతం పలికిన యూత్ లీడర్ చెక్క ప్రశాంత్



**అబ్దుల్లాపూర్ మెట్టు సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి) :** సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడిచిన ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ఏవి నెరవేర్చలేదంటూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు, బిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి తుర్కయంజాల్ లోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మంచి బుద్ధి ప్రసాదించి ఇచ్చిన హామీలు నెరవేర్చేలా చూడాలంటూ ఆయన తుర్కయంజాల్ కు చేరుకున్నారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఆదిభట్ల సీరియల్ తుర్కయంజాల్ డివిజన్ యూత్ నాయకులు చెక్క ప్రశాంత్( బబ్లు) మంచిరెడ్డి కిషన్ రెడ్డికి శాలువాతో ఘనంగా సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పట్టు వదలని విక్రమార్కుడిలా పోరాటం సాగిస్తున్న మంచిరెడ్డి కిషన్ రెడ్డికి తాము సైన్యం లాగా ఆయన వెనుకుండి పని చేస్తామని చెక్క ప్రశాంత్ తెలిపారు.

# నోటీసులు జారీ అయిన ఓటర్లు హియరింగ్‌కు హాజరుకావాలి

**- 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాలి: - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**ముస్తాబాద్, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి) :** ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నోటీసులు జారీ అయిన ఓటర్లు హియరింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. హియరింగ్‌కు హాజరయ్యే సమయంలో ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానితో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను తీసుకురావాలని తెలిపారు.

ముస్తాబాద్ మండలం చీకోడులో మంగళవారం ఎస్ఐఆర్‌లో భాగంగా నిర్వహించిన హియరింగ్ సమావేశానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై, ఓటర్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లు ఎంతమంది ఉన్నారు, కొత్త ఓటర్లుగా ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారనే వివరాలను ఆమె ఆరా తీశారు. మండల పరిధిలో మొత్తం 7,005 మంది నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో హియరింగ్ సమావేశాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) తమ పరిధిలో నోటీసులు అందుకున్న ఓటర్లకు సమాచారం అందించి, వారు హియరింగ్‌కు హాజరయ్యేలా చూడాలని సూచించారు. తహసీల్దార్లు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మన ఆంజనేయులు, ఆర్డీవో శ్రీధర్ బాబు, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబాద్‌లో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

**- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి: మల్లారపు సంతోష్ రెడ్డి**



**ముస్తాబాద్, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి) :** భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షుడు సౌల్లా క్రాంతికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి ప్రాణమని, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయిలో పార్టీ కమిటీలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. 'వికసిత్ భారత్ సంకల్పం'లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో ప్రజల పక్షాన పోరాటాలు చేపట్టాలని తీర్మానించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, మండల ఉపాధ్యక్షులు చికోటి మహేష్, చిట్టినేని శ్రీనివాస్ రావు, మెంగని మహేందర్, వరి వెంకటేష్, చిగురు వెంకన్న, మీస స్వామి, దీటి సత్తయ్య, ఒరగంటి సత్యం, మర్గల వేణు, మీస కర్ణాకర్, మల్లేశం, యాదగిరి, నర్సింలు, తిరుపతి, వినయ్‌తో పాటు బూత్ కమిటీ అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై గళమెత్తితే అరెస్టులా?

**- ప్రతిపక్ష గొంతును నొక్కే కుట్రలు సాగవు**
**- కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ నేత సంపత్‌రావు ఫైర్**




**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి) :** ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ ప్రజల తరఫున గళమెత్తుతున్న బీఆర్ఎస్ నాయకులను అర్ధరాత్రి,తెల్లవారి జామున వేళ పోలీసులు అదుపులోకి తీసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత,నిరంకుశ వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుంకిశాల సంపత్‌రావు తీవ్రంగా మండిపడ్డారు.కరీంనగర్ రూరల్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సంపత్‌రావు,పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి,ఇరుకుళ్ల సర్పంచ్ బుర్ర రమేష్‌గౌడ్,తహేర్ కొండాపూర్ సర్పంచ్ గిరి,దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్ తోట తిరుపతి,గాదె శ్రీనివాస్,బాల్‌రాజు,తిరుపతి, కుమార్‌లను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకుని కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం,వాటిని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు పోలీసులను ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.ప్రజల సమస్యలను ప్రస్తావిస్తే కేసులు,అరెస్టులు,నిర్బంధాలతో భయపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు.ప్రశ్నించే గొంతును అరెస్టు చేయగలరేమో కానీ ప్రజల ఆకాంక్షలను అరెస్టు చేయలేరని పేర్కొన్నారు.ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న ప్రతిపక్ష నాయకులపై ఒత్తిళ్లు, బెదిరింపులు,పోలీసు చర్యలతో ప్రజా ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని,రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ, ప్రతిపక్ష నాయకుడికీ ఉందని పేర్కొన్నారు,అదుపులోకి తీసుకున్న బీఆర్ఎస్ నాయకులందరినీ ఎలాంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత వైఖరికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని, ప్రభుత్వంపై మరింత తీవ్రస్థాయిలో పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై వ్యాఖ్యల ఖండన

**మల్యాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు**





**మల్యాల, సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను మల్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి విజ్ఞాపన పత్రం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మ దహనం చేసి తనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... దళిత వర్గానికి చెందిన వ్యక్తి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉండటం జీర్ణించుకోలేకనే ప్రత్యర్థులు అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. దళిత సీఎం, మూడెకరాల భూమి, దళిత బంధు హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం భట్టి విక్రమార్కను డిప్యూటీ సీఎంగా, గడ్డం ప్రసాద్‌ను స్పీకర్‌గా చేసి దళితులకు సముచిత స్థానం కల్పించిందని, ఎస్సీ వర్గీకరణకు కూడా శ్రీకారం చుట్టిందని తెలిపారు. బీఆర్ఎస్‌లోని దళిత నాయకులు ఆత్మగౌరవం కోసం గళమెత్తాలని, దళితులపై అవమానాలను కాంగ్రెస్ సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు ఫారంపాండ్ నిర్మించుకోవాలి

**- సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ - ఒడ్యాడ్ గ్రామంలో ఫారంపాండ్ నిర్మాణ పనులకు శ్రీకారం**



**భీమారం, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):** వర్షపు నీటిని ఒడిసిపట్టి వ్యవసాయానికి వినియోగించుకునేలా ప్రతి రైతు తమ పొలాల్లో ఫారంపాండ్ నిర్మించుకోవాలని ఒడ్యాడ్ గ్రామ సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ సూచించారు. నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపునకు ఫారంపాండ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. గ్రామానికి చెందిన పుట్ట రాజేందర్ తోటలో ఫారంపాండ్ నిర్మాణ పనులను సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ ప్రారంభించారు. వర్షాకాలంలో పొలాల్లోకి వచ్చే నీటిని ఫారం పాండ్‌లో నిల్వ చేసుకోవడం ద్వారా పంటలకు అవసరమైన సమయంలో నీటిని వినియోగించుకోవచ్చన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఫారంపాండ్లు నిర్మించుకోవాలని కోరారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, నేటి నీటి నిల్వే రేపటి సాగుకు భరోసా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శైలజ, కారోబర్ గంగానర్సయ్య, ఉపాధి హామీ కూలీలు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి**
**- రైతులు సాగు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలి**
**- సేంద్రియ, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి**
**- వ్యవసాయ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి, సెప్టెంబర్ 08 ప్రజా జ్యోతి :** డిజిటల్ క్రాప్ సర్వేను ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. వ్యవసాయ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. డిజిటల్ క్రాప్ సర్వే, యూరియా సరఫరా, సేంద్రియ వ్యవసాయం, పంటల సాగు విస్తీర్ణం, రైతులకు అందుతున్న వ్యవసాయ సేవలు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ పరిధిలో సేంద్రియ వ్యవసాయం పెరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని అన్నారు. డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు ఏ పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వేలో ఎలాంటి తప్పులు, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. పంటల సాగు పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ నీటి లభ్యత, నేల స్వభావం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఒకే పంటపై ఆధారపడకుండా రైతులకు లాభదాయకమైన పంటలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని రైతులతో నిరంతరం అందుబాటులో ఉంటూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంటల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రైతులకు అందుతున్న సేవల అమలును మండలాల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని, లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సంబంధిత మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో
# రైతుకు రూ.3.45 లక్షల ఆదాయం



**ముస్తాబాద్, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి) :** నామాపూర్‌లో ఏడు ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు 15 టన్నుల దిగుబడి సాధించిన రైతు అరవెల్లి చంద్రశేఖర్ రావు ఆదర్శ రైతు క్షేత్రాన్ని పరిశీలించి అభినందించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో ముస్తాబాద్‌కు చెందిన రైతు అరవెల్లి చంద్రశేఖర్ రావు ఆయిల్ పామ్ సాగులో మంచి దిగుబడి సాధించి ఆదర్శంగా నిలిచారు. సుమారు నాలుగేళ్ల క్రితం ఏడు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటి, శాస్త్రీయ పద్ధతుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో ప్రస్తుతం 15 టన్నుల దిగుబడి సాధించి రూ.3.45 లక్షల ఆదాయం పొందారు. ప్రస్తుతం మరో రెండు ఎకరాల్లో మామిడి, నిమ్మ తోటలను సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు అరవెల్లి చంద్రశేఖర్ రావు వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఆయిల్ పామ్ మొక్కల పెరుగుదల, దిగుబడి తదితర అంశాలను పరిశీలించిన కలెక్టర్.. తదుపరి పంట ఎప్పుడు చేతికి వస్తుందని రైతును అడిగి తెలుసుకున్నారు.

ఆయిల్ పామ్‌ను ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు, మొక్కలను ఎక్కడి నుంచి తీసుకున్నారు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం, సస్యరక్షణ చర్యలు, పెట్టుబడి, దిగుబడి, ఆదాయం తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మంచి దిగుబడి సాధిస్తున్న రైతును అభినందించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రైతులు దీర్ఘకాలికంగా ఆదాయం సమకూర్చే ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఆయిల్ పామ్ మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తొలి మూడు సంవత్సరాల్లో ఉద్యానవన శాఖ అధికారుల సూచనల మేరకు అంతర పంటలుగా కూరగాయలు, పూలు, పండ్ల మొక్కలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో కోతుల బెడదతో పాటు చీడపీడల సమస్యలు తక్కువగా ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ ధర రూ.24,025గా ఉందని తెలిపారు. జిల్లాలో నామాపూర్, బోయినపల్లి, నేరెళ్ల, సిరిసిల్ల ప్రాంతాల్లో ఆయిల్ పామ్ కలెక్షన్ కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు. ఇక్కడ సేకరించిన ఆయిల్ పామ్ ఉత్పత్తులను సిద్ధిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద ఉన్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మరింత మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకు వస్తే అవసరాన్ని బట్టి మరిన్ని ఆయిల్ పామ్ కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. అనేక ప్రయోజనాలు, దీర్ఘకాలిక ఆదాయం ఉన్న ఆయిల్ పామ్ సాగు వైపు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నామాపూర్‌కు చెందిన రైతు ఆయిల్ పామ్‌తో పాటు ప్రస్తుతం మామిడి, నిమ్మ తోటలను సాగు చేస్తున్నారని, తద్వారా భవిష్యత్తులో మరింత ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఏడీఏ ప్రదీప్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

## బీర్‌పూర్ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ నూతన ఈఓగా డి.కిరణ్ బాధ్యతల స్వీకరణ




**బీర్‌పూర్, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి) :** బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ నూతన పూర్తిస్థాయి కార్యనిర్వాహణాధికారిగా డి. కిరణ్ మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ దేవాదాయ శాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ నియామకం జరిగింది. ఇప్పటివరకు జగిత్యాల జిల్లా నల్లగొండ దేవాలయం ఈఓగా విధులు నిర్వహిస్తున్న డి. కిరణ్‌ను, బీర్‌పూర్ ఆలయ పూర్తిస్థాయి ఈఓగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు మంగళవారం ఉదయం ఆలయ కార్యాలయంలో ప్రస్తుత ఈఓ ఎస్. శ్రీనివాస్ నుంచి ఆయన అధికారికంగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని నూతన ఈఓ కిరణ్‌కు ఘనంగా స్వాగతం పలికారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్



**మల్యాల, సెప్టెంబర్ 08, ప్రజా జ్యోతి :** కొండగట్టు ఆంజనేయ స్వామిని హైడ్రా కమిషనర్ ఐపీఎస్ రంగనాథ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కొండగట్టు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.... హైడ్రా యొక్క ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, కబ్జాలకు గురి అయిన దాదాపుగా 1.50 లక్షల కోట్ల భూములను కాపాడి ప్రభుత్వానికి అప్పగించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములు,చెరువులు, కుంటల కబ్జాలు తగ్గాయని,అక్రమ కట్టడాలను కూల్చివేయడంతో అక్రమ కట్టడాలు ఆగాయి అని అన్నారు. హైదరాబాదులోని మూడు నియోజకవర్గాల వరకు విస్తరించి ఉన్న హైడ్రా కార్యకలాపాలను ప్రభుత్వం ఆమోదిస్తే రాష్ట్రవ్యాప్తంగా విస్తరింప చేస్తామన్నారు.హైడ్రాపై వచ్చిన దుష్ప్రచారాలను ప్రజలు నమ్మకుండా స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించి హైడ్రాకు మద్దతు తెలుపుతున్నారని ఆయన తెలిపారు.

## రైతు గుర్తింపు కార్డు నమోదు చేసుకోండి



**ఎండపల్లి, సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి :** మండలంలో రైతు గుర్తింపు కార్డు (ఫార్మర్ ఐడీ) నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్ ఆదేశాల మేరకు గుల్లకోట ఏఈఓ లావణ్య, కొత్తపేట ఏఈఓ మౌనిక, గోడిసెల పేట ఏఈఓ సందీప్ వారి వారి క్లస్టర్ల పరిధిలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలని,అంతర్జాల సమూహ వేదికగా ఒక ప్రకటనలో పేర్కొంటూ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఇది అవసరమని తెలిపారు. పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందడంతో పాటు ఎరువులను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు కూడా రైతు గుర్తింపు కార్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని రైతులు సమీపంలోని రైతువేదికకు వెళ్లి సంబంధిత ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, సందీప్, లావణ్య, మౌనిక , రైతులు పాల్గొన్నారు,

# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ ఎస్సీ సెల్



**ముస్తాబాద్, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి) :** ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు, దళితుల ఆత్మగౌరవానికి అవమానకరమని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య కార్యకర్తలకు ప్రజాస్వామ్య విలువలు, సభా సంప్రదాయాలపై శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. దళితుల సంక్షేమం విషయంలో గత ప్రభుత్వ హామీలపై కూడా నాయకులు ప్రశ్నలు సంధించారు. దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళిత బంధు వంటి హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంపెల్లి శ్రీనివాస్, యారటి కరుణాకర్, జగ్గు నరేష్, బిళ్లం సామి, దుబ్బాక రాజు, సదుమల బాలయ్య, గంతరాజు నాగరాజు, మండల మహిళా అధ్యక్షురాలు వనిత, నల్ల బుచ్చయ్య, తలారి నరసయ్య, మచ్చ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

★ భూ భారతి రీ సర్వేతో భూ రికార్డుల ప్రక్షాళన ★ రైతుల హక్కులు, హద్దులకు మరింత భద్రత ★ ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు

ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రీ సర్వేతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు భూ రికార్డులు మరింత పారదర్శకంగా, పకడ్బందీగా రూపొందుతాయని మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు అన్నారు. భవిష్యత్తులో భూ వివాదాలు, హద్దుల సమస్యలు, రికార్డుల్లో తలెత్తే లోపాలకు రీ సర్వే ద్వారా శాశ్వతంగా చెక్ పెట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో తాటిగూడెం రెవెన్యూ పరిధిలోని రైతులకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం భూ భారతి రీ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, తహసీల్దార్ కె. సునీతా ఎలిజబెత్ హాజరై రైతులకు రీ సర్వే ప్రక్రియ, దాని ప్రాధాన్యత, రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూ భారతి రీ సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూముల హద్దులను ఖచ్చితంగా గుర్తించి, అందుకు అనుగుణంగా భూ రికార్డులను నవీకరించడం జరుగుతుందని తెలిపారు. రీ సర్వే పూర్తయితే రైతుల భూములకు సంబంధించిన వివరాల్లో మరింత స్పష్టత ఏర్పడుతుందని, భవిష్యత్తులో భూ



లావాదేవీలు, వారసత్వ హక్కులు తదితర వ్యవహారాల్లో రైతులకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. భూమి కొలతలు, హద్దులు, యాజమాన్య హక్కులు తదితర అంశాల్లో స్పష్టత రావడం వల్ల తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుందన్నారు. భూ రికార్డులు పకడ్బందీగా ఉంటే రైతులకు బ్యాంకు రుణాలు, భూముల క్రయవిక్రయాలు, వారసత్వ బదలాయింపులు తదితర వ్యవహారాల్లో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.రైతులు రీ సర్వే ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వే సమయంలో ప్రతి రైతు తమ భూమికి సంబంధించిన వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, అధికారులకు అవసరమైన సమాచారం అందించి సహకరించాలన్నారు. భూముల హద్దులు, రికార్డులకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులకు న్యాయం జరిగేలా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మధిర నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని బండారు నరసింహారావు అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, భూ భారతి రీ సర్వే కూడా రైతులకు భవిష్యత్తులో ఎంతో మేలు చేసే కార్యక్రమమని పేర్కొన్నారు. రైతులందరూ రీ సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించి, తమ భూములకు సంబంధించిన రికార్డులను సరిచేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి,ఏఎంసి చైర్మన్ బండారు నరసింహారావు, తహసీల్దార్ కె. సునీతా ఎలిజబెత్,ఆర్ ఐ లు రవి కుమార్, శ్రీషా, ఏఎస్ఓ జానీ,జీపీవో శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాసరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి,ఉప సర్పంచ్ గొర్రాజు మల్లేశ్వరి,కర్నాటి సుధాకర్ రెడ్డి,వేముల వెంకటేశ్వరావు, గొర్రాజు రాములు రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారంలో ఉన్నప్పుడు అక్రమ సంపాదన.. ఇప్పుడు దిక్కుమాలిన విమర్శలా?

★ బీఆర్ఎస్ కౌన్సిలర్ అప్పారావు డైలాగులు మానుకోవాలి ★ తెరవెనుక స్క్రిప్టులు ఆపి మధిర అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి

★ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మధిర అభివృద్ధికి నోచుకోలేదు ★ సీఎం భట్టి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఈ వలపు కన్నీళ్లు

★ మధుర మహిళా కౌన్సిలర్స్ ఘాటు విమర్శ

మధిర ప్రజా జ్యోతి మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాతపై 19వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ యాన్నంశెట్టి వెంకట అప్పారావు చేసిన ఆరోపణలను అధికార పార్టీ మహిళా కౌన్సిలర్లు తిప్పికొట్టారు.ఎవరో తెర వెనుక ఉండి రాసిచ్చిన స్క్రిప్ట్‌ను పట్టుకుని మీడియా ముందు డైలాగులు కొట్టడం కాదని,దమ్ముంటే మధిర అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.అధికారాలు, పదవులు ఇప్పుడు పోయాయనే బాధను మనసు నుంచి వదులుకోలేక,ఆ పదవి మీద ఉన్న వ్యామోహంతో బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కనడం మానుకోవాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

**పదవులు పోయిన బాధతోనే ఈ దిగజారుడు ఆరోపణలు**

కమల్ రాజు గురించి మాట్లాడే అర్హత చైర్‌పర్సన్‌కు లేదంటూ బీఆర్ఎస్ నేతలు నోరుపారేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని,ప్రజాక్షేత్రంలో ప్రజలచేత ఎన్నుకోబడి, పరిపాలనా దక్షతతో ముందుకు వెళ్తున్న ఒక మహిళా చైర్‌పర్సన్‌ను ప్రశ్నించే నైతిక హక్కు పదేళ్లు మధిరను నిర్లక్ష్యం చేసిన మీకు ఎక్కడిది? అని కౌన్సిలర్లు నిలదీశారు.చైర్‌పర్సన్ సుజాతను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ అప్పారావు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వలించినట్లుగా ఉందని మండిపడ్డారు. వెనుక ఉండి ఎవరో డైరెక్షన్ చేస్తుంటే ఆ తోలుబొమ్మలా ఆడుతూ ప్రెస్‌మీట్లు పెట్టే ఆ సంస్కృతి మీదేనని,చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం కి పరిపాలనపై ఉన్న స్పష్టత, ప్రజల సంక్షేమంపై ఉన్న పట్టు మీ గుండెల్లో రైళు పరిగెత్తిస్తున్నాయని ఎద్దేవా చేశారు.

**మధిర అభివృద్ధిని విస్మరించిన చరిత్ర మీ నాయకుడిదే**

మధిర మున్సిపాలిటీని గాలికొదిలేసిన కమల్ రాజు హయాంలోని తీరు ప్రజలందరికీ తెలుసని దుయ్యబట్టారు.2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మధిరలో ఏ ఒక్కరోజైనా సరైన ప్రగతి జరిగిందా అని కౌన్సిలర్లు నిలదీశారు.కేవలం నిధులను దండుకోవడం, కాంట్రాక్టర్ల బిల్లుల కోసమే వెంపర్లాడిన చరిత్ర మీ నాయకుడిదని,ప్రజల కష్టాలను పట్టించుకోకుండా కాలక్షేపం చేశారని మండిపడ్డారు.అలాంటి పాలనను చూసిన మధిర ప్రజలు,నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న సుపరిపాలనను చూసి ఆనందిస్తుంటే.. ఓర్వలేక కడుపుమంటతో ఇలాంటి చిల్లర ఆరోపణలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు.

**భట్టి విక్రమార్క కృషితోనే మధిరలో నూతన శకం**

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కఅసాధారణ కృషితోనే మధిర నియోజకవర్గంతో పాటు మున్సిపాలిటీలో



నూతన శకం ప్రారంభమైందని స్పష్టం చేశారు.కేవలం శంకుస్థాపనలంటూ అబద్ధాలు ప్రచారం చేసే బదులు,భట్టి విక్రమార్క తీసుకొచ్చిన వేల కోట్ల నిధులతో మారుతున్న మధిర రూపురేఖలు మీ కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.ప్రజల సంక్షేమాన్ని అడ్డుకోవాలని చూస్తే రాజకీయంగా తగిన మూల్యం చెల్లించుకోవడం ఖాయమని,చేతకాని మాటలతో కాలక్షేపం చేయడం మాని క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దోర్నాల శిరీష,యర్రందసు చారులత, బోడపూడి రేవతి, గద్దల మాధురి, షేక్ రసుద్దీన్, నగరకంటి రాజేశ్వరి, బొల్లెద్దు విజయలక్ష్మి, రంగ రూప తదితరలు పాల్గొన్నారు.

# "మహిళా ఎమ్మెల్యేల అరెస్టు దుర్మార్గం.."

★ మణుగూరులో బీఆర్ఎస్ మహిళా నేతల ఆగ్రహం ★ ప్రశ్నిస్తే అరెస్టులా..? అంబేద్కర్ సెంటర్లో బీఆర్ఎస్ మహిళల నిరసన జ్వాల

★ కాంగ్రెస్ సర్కార్ దిగిరావాలి.. అక్రమ కేసులు ఎత్తేయాలని మణుగూరులో డిమాండ్

మణుగూరు క్రైమ్,సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి) ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించడానికి వెళ్లిన ప్రతిపక్ష మహిళా ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ పినపాక నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా నాయకులు మంగళవారం మణుగూరు అంబేద్కర్ సెంటర్లో నిరసన చేపట్టారు.ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రజా ప్రతినిధుల హక్కు,బాధ్యతనీ ప్రశ్నించినందుకే మహిళలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు.ఈ సందర్భంగా డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతి





పత్రం అందజేసి,అక్రమ కేసులు, అరెస్టులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని,మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తోందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో పలువురు మహిళా నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పినపాక విద్యాశాఖకు జిల్లా స్థాయిలో కీర్తి

★ ఉత్తమ ఉద్యోగి అవార్డుతో వెంకటేశ్వరరావుకు ఘన గౌరవం ★ కర్తవ్య నిబద్ధతకు పట్టం ★ సేవా స్ఫూర్తికి సముచిత గుర్తింపు

పినపాక, సెప్టెంబర్ 8(ప్రజాజ్యోతి) విధి నిర్వహణలో అంకితభావం.. బాధ్యతల్లో నిబద్ధత.. విద్యారంగ ప్రగతిలో నిరంతర తపన.. సమన్వయంలో సమర్థత.. వుటుకూరు వెంకటేశ్వరరావును జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా నిలిపాయి. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయిలో ఆయనకు ఉత్తమ ఉద్యోగి అవార్డు--2026 లభించింది. పినపాక మండల విద్యాశాఖ పరిధిలో లికాంప్లెక్స్ కోఆర్డినేటర్ (జజూ)లిగా సేవలందిస్తున్న వెంకటేశ్వరరావు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. విద్యా కార్యక్రమాల అమలు, ఉపాధ్యాయులతో







సమన్వయం, పాఠశాలల అభివృద్ధికి సహకారం, విద్యార్థుల అభ్యసన ప్రమాణాల పెంపుదల వంటి అంశాల్లో ఆయన చూపిన చొరవకు ఈ పురస్కారం దక్కింది.

**సేవే లక్ష్యంగా.. విధే ధ్యేయంగా..**

ఉద్యోగాన్ని కేవలం విధి నిర్వహణగా కాకుండా విద్యా వ్యవస్థకు తన వంతు సేవగా భావిస్తూ ముందుకు సాగుతున్న వెంకటేశ్వరరావు పనితీరుకు ఈ అవార్డు అద్దం పడుతోంది. సహచర ఉపాధ్యాయులతో స్నేహపూర్వక సమన్వయం, అధికారుల సూచనలను సమర్థవంతంగా అమలు చేయడం, విద్యా రంగంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించేందుకు చొరవ చూపడం ఆయన ప్రత్యేకతగా విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

**అభినందనల వెల్లువ**

జిల్లా స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న వి. వెంకటేశ్వరరావును పినపాక మండల విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య అభినందించారు. ఆయన సేవలకు లభించిన ఈ గౌరవం పినపాక మండల విద్యాశాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. అదేవిధంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండలంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్‌పీలు వెంకటేశ్వరరావుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

**కృషికి కిరీటం.. కర్తవ్యానికి గౌరవం..**

సేవకు సత్కారం గా ఈ పురస్కారం నిలిచిందని వారు పేర్కొన్నారు. పినపాక మండలం నుంచి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకోవడం పట్ల విద్యాశాఖ వర్గాల్లో హర్షం వ్యక్తమైంది. పినపాక విద్యారంగానికి మరింత వన్నె తీసుకొచ్చేలా భవిష్యత్తులోనూ ఆయన మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు.

# ముత్తారంలో పోషణ మాసం కార్యక్రమం

ముదిగొండ సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి) ముదిగొండ మండలం ముత్తారం గ్రామపంచాయతీ పరిధి అంగన్వాడి కేంద్రంలో పోషకాహార వారోత్సవాలు సందర్భంగా పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోషకాహార లోపం వల్ల పిల్లలు బరువు తగ్గుదల, పిల్లలు తీసుకునే ఆహార అలవాట్ల పద్ధతి వివరించడం జరిగింది. అదేవిధంగా పిల్లలు బరువు పెరగడానికి తీసుకోవాల్సిన పోషక ఆహార పదార్థాలు గురించి వివరించడం జరిగింది. పోషకాహార లోపం వల్ల పిల్లలు వ్యాధుల బారిన పడకుండా తల్లులు తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లంజపల్లి మమత, పంచాయతీ సెక్రెటరీ వీరబాబు,



ఆశ వర్కర్ మూల పుష్ప, అంగన్వాడీ టీచర్స్ జానకి, రేణుక, అంగన్వాడి ఆయా, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురం, సువర్ణాపురం గ్రామ పంచాయతీలను

# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా పంచాయతీ అధికారి వినోద్

ముదిగొండ సెప్టెంబర్ 8(ప్రజా జ్యోతి) మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం,సువర్ణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయాలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో ) వినోద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా పంచాయతీ పరిధిలోని రికార్డులు, రిజిస్టర్లు, పన్ను వసూళ్ల వివరాలు, నగదు పుస్తకాలను ఆయన నిశితంగా పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా తీరుపై ఆయన ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని, విధుల్లో ఎలాంటి అలసత్వం వహించరాదని ఆయన ఆదేశించారు. ఈ



కార్యక్రమంలో ముదిగొండ మండల ఇంచార్జి ఎంపీవో రామకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి దేగల సురేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## తాతా మధు వ్యాఖ్యలకు నిరసనగా

# దిష్టిబొమ్మ దగ్ధం చేసిన కాంగ్రెస్ మండల నాయకులు

★ మండల అధ్యక్షుడు దేవ్ సింగ్ ఆధ్వర్యంలో నిరసన



రఘునాథపాలెం: ప్రజా జ్యోతి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని రఘునాథపాలెం మండల అధ్యక్షుడు దేవ్ సింగ్ మండిపడ్డారు.స్పీకర్పై ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం మండల కేంద్రంలోనీ యాపిల్ చౌరస్తాలో మంగళవారం మండల అధ్యక్షులు,దేవ్ సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తాతా మధు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు ఈ కార్యక్రమంలో ఏఎంసి మార్కెట్ చైర్మన్ హనుమంతరావు, ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ...అత్యున్నత స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై బాధ్యతారహితంగా, అవమానకరంగా



మాట్లాడడం బీఆర్ఎస్ పార్టీ అహంకారానికి నిదర్శనమన్నారు. తాతా మధు తక్షణమే స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా బీఆర్ఎస్ నాయకత్వం కూడా తగిన చర్యలు చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కోటేష్ నాయక్, సర్పంచ్ గాజుల కృష్ణారావు, కిలారు వెంకటరమణ, రామ్మూర్తి , చెరుకూరి పూర్ణ , బోయినపల్లి లక్ష్మణ్ , రవీందర్ ,రమణగా, కొంటెముక్కుల నాగేశ్వరరావు , రమణ సుధాకర్ , రమేష్ నాయక్ ,అరవి కట్ల సుధీర్ దొంత, అక్కెనపల్లి ఉపేందర్, బోయినసత్యం , బానోతు ఉపేందర్ , లింగాల మహేష్ , దొంతబోయిన శ్రీను,సర్పంచులు నవీన్ నాయక్ చిన్నయ్య నర్సిరెడ్డి,మూడు చిన్న నాయక్ సిద్దయ్య ఉపసర్పంచ్ ఆదూరి రాణి మహిళ నాయకురాలు ఎస్ కే జరీనా, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# తక్కెళ్ళపాడులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఎర్రుపాలెం ప్రజా జ్యోతి గౌరవ తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క చొరవతో తక్కెళ్ళపాడు గ్రామంనికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సర్పంచ్ ముక్కర రామకృష్ణారెడ్డి సీనియర్ కాంగ్రెస్ లీడర్ ఐలూరి వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మంగళ వారం కూరపాటి మైనర్ బాబు 40000 కొవ్వూరి లక్ష్మీ 35000 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శీలం ప్రతాప్ రెడ్డి, ఉప సర్పంచ్ కూరపాటి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అయిలూరి రవీందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యం.శ్రీనివాస్ పంచాయతీ పాలక వర్గ



సభ్యులు గట్టిగుండే వెంకట్ శీలం రామిరెడ్డి కూరపాటి వరుణ్ కూరపాటి మరియమ్మ ,తలుపుల విజయబాబు కురవటి మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి టూరిజం నోడల్

# అధికారిణిగా అనూష నియామకం

★ గ్రూప్-1 అధికారిణి అనూషకు అదనపు బాధ్యతలు

★ జిల్లా యువజన అధికారిగా పరాధామ రెడ్డి ★ మంగళవారం కలెక్టర్ అంకిత్ ఉత్తర్వులు జారీ

★ జిల్లా పర్యాటక అభివృద్ధిపై కలెక్టర్ ఫోకస్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి./సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి) జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న గ్రూప్-1 అధికారిణి అనూషను టూరిజం నోడల్ అధికారిణిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఇటీవల రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నిర్వహించిన సమావేశం లో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నియామకం జరిగినట్లు కలెక్టర్ తెలిపారు. నూతన నోడల్ అధికారిణి జిల్లా వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి,అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. ఇప్పటివరకు టూరిజం అధికారి గా ఉన్న పరాధామ రెడ్డి ఇకపై జిల్లా యువజన,క్రీడల



అధికారి గా కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

## – విద్యార్థినులకు కలెక్టర్ దీపక్ తివారీ సూచన

వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 8( ప్రజా జ్యోతి): విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పదో తరగతి సాంఘిక శాస్త్రం తరగతిని కలెక్టర్





పరిశీలించారు. విద్యార్థినులను ప్రాథమిక హక్కులు, విధులపై ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. విద్య ద్వారానే మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చని, చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. విద్యతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని తెలిపారు. గత సిలబస్‌పై కూడా ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం భోజనశాల, స్టోర్, వంటగదులను పరిశీలించిన కలెక్టర్ మధ్యాహ్న భోజనానికి సిద్ధం చేసిన వంటకాలను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో మౌలిక వసతులపై ఆరా రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆసుపత్రి మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, ఆసుపత్రి స్థలం ఆక్రమణలకు గురికాకుండా ఆవరణ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జెడ్పీ సీఈఓ సుధీర్, డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ప్రాంతాలుగా అరుణాచల్, అక్సాయ్‌చిన్

## అక్సాయ్‌చిన్‌కు పశ్చిమాన భారత్, తూర్పున చైనా

## ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్‌లో ప్రత్యక్షం..!?

న్యూఢిల్లీ,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం మరోసారి చర్చనీయాంశంగా మారింది. 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో వెలువడిన ఈ మ్యాప్‌లో అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను భారత్, చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపించారు. అక్సాయ్‌చిన్‌ను లడఖ్‌లో భాగంగా భారత్ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానంపై చర్చలు జరుగుతున్న సమయంలో జులై 1న ఈ మ్యాప్‌ను తొలిసారి విడుదల చేశారు. ఇందులో అరుణాచల్‌ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించారు. అరుణాచల్‌ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చూపిస్తూ.. పశ్చిమాన అసోం, ఉత్తరాన చైనా సరిహద్దుగా ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. అదే విధంగా అక్సాయ్‌చిన్‌ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. దాని పశ్చిమ వైపు భారత్, తూర్పు వైపు చైనా సరిహద్దులు ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. ఈ మార్పులు ఎందుకు చేశారన్న దానిపై ఐరాస ఎలాంటి వివరణ ఇవ్వలేదు. జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉన్న నియంత్రణ రేఖ (ఎల్ఓసీ)ని కూడా మ్యాప్‌లో చుక్కల రేఖతో చూపించారు. దీనిపై మ్యాప్ కింది భాగంలో ఐరాస వివరణ ఇచ్చింది. భారత్, పాకిస్థాన్ అంగీకరించిన జమ్మూ కశ్మీర్ ఎల్ఓసీని ఈ చుక్కల రేఖ సుమారుగా సూచిస్తుందని పేర్కొంది. జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా అంగీకారం కుదరలేదని తెలిపింది. ప్రపంచంలోని ప్రాంతాలను పటాల్లో మరింత కచ్చితంగా, సమానత్వంతో చూపించాలంటూ ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో తీసుకొచ్చిన 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం గత వారం ఆమోదించింది. ముఖ్యంగా ఆఫ్రికా ప్రాంతాల భౌగోళిక చిత్రణను మరింత సమానంగా చూపించడమే దీని లక్ష్యం. ఈ తీర్మానం చట్టబద్ధంగా అమలు చేయాల్సినది కాదు. అయితే ప్రపంచవ్యాప్తంగా బహుళపక్ష సంస్థలు ఉపయోగించే ప్రామాణిక ప్రపంచ పటాల్లో దీనికి అనుగుణంగా మార్పులు చేసే అవకాశం ఉంది. ఆఫ్రికన్ గ్రూప్ తరఫున టోగో ఈ తీర్మానాన్ని ముందుకు తీసుకెళ్లింది. భారత్ దీనికి మద్దతు తెలిపింది. సమాన విస్తీర్ణాన్ని ప్రతిబింబించే పటాల రూపకల్పన అనే మౌలిక సూత్రానికి మద్దతుగా తాము ఓటు వేసినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఏదైనా నిర్దిష్ట పటం, మ్యాప్ ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణకు ఈ తీర్మానం ఆమోదం కాదని స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు సహా భారత సార్వభౌమ భూభాగాన్ని అధికారిక భారత పటం ప్రకారమే చూపించాలని పేర్కొంది. తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే చిత్రణను అంగీకరించబోమని తెలిపింది.

# శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

## నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం

## టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్‌వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు ఊరట

మొదటిపేజీ తరువాయి..

దురుసుగా వ్యవహరించారనే అభియోగాలపై పోలీసులు.. ఇవాళ ఉదయం తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అయితే పోలీసులు కోరిన రిమాండ్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను మంగళవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వారిని నాంపల్లి కోర్టు ముందు హాజరుపరిచి రిమాండ్ కోరారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఇద్దరికీ వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించడంతో పాటు రెండు ష్యూరిటీలు ఇవ్వాలని ఆదేశించింది. అవసరమైన పూచీకత్తు, ష్యూరిటీలు సమర్పించిన తర్వాత వారిద్దరినీ విడుదల చేయాలని పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశించింది. దీంతో న్యాయపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎమ్మెల్సీలు విడుదల అయ్యారు. విచారణ సందర్భంగా అసెంబ్లీ వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన దృశ్యాలను అసెంబ్లీ లీగల్ టీమ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వాటిని పరిశీలించిన అనంతరం న్యాయస్థానం ఇరుపక్షాల వాదనలు విన్నది. ఎమ్మెల్సీల తరఫు న్యాయవాదులు ఈ కేసులు రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా నమోదు చేశారని వాదించినట్లు తెలుస్తోంది. రిమాండ్‌ను తిరస్కరించి తమ క్లయింట్లను విడుదల చేయాలని కోర్టును కోరారు. మరోవైపు పోలీసులు కేసు నమోదు చేసిన కారణాలను కోర్టుకు వివరించారు. ఇదిలా ఉండగా.. అసెంబ్లీ వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి తెలంగాణ హైకోర్టులోనూ పరిణామాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దని, ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట బైఠాయించి ప్లకార్డులతో నిరసన తెలిపారని.. ప్రభుత్వ వ్యతిరేక రాతలతో కూడిన నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారని అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరించినట్లు తెలుస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే పోలీసులు వారిని అడ్డుకున్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాదించింది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు నిబంధనలు ఉల్లంఘించారని.. నిషేధాజ్ఞలను పాటించలేదని ఏజీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విధుల్లో ఉన్న పోలీసులు, మహిళా కానిస్టేబుళ్లను నెట్టివేయడంతో పాటు దూషించారని ప్రభుత్వం ఆరోపించింది. ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉన్నప్పటికీ, స్పీకర్ ఆదేశాల మేరకే పోలీసులు వారిని అడ్డుకున్నారని ఏజీ వివరించినట్లు తెలుస్తోంది.

అంతకు ముందు బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. సోమవారం హైదరాబాద్ లో అసెంబ్లీ ప్రాంగణంలో చేపట్టిన నిరసన ప్రదర్శనల సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ జీ ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో అరెస్ట్ అయ్యారు. కొద్దిసేపటి కిందటే పోలీసులు న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో వారిని అదుపులోకి తీసుకున్నారు. నారాయణ గూడ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అసెంబ్లీ స్పీకర్ ఓఎస్డీ పోలేపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిద్దరిపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. బీఎన్ఎస్ సెక్షన్ 352, 3(5), ఎస్సీ/ఎస్టీ చట్టంలోని సెక్షన్లు 3(1)(ఆర్), 3(2)(వీఏ), 3(2)(7) కింద కేసు నమోదు చేశారు. దీనికి అనుగుణంగా కొద్దిసేపటి కిందటే వారిని అదుపులోకి తీసుకున్నారు. తాతా మధు అరెస్ట్ సమాచారం తెలుసుకున్న వెంటనే పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్వార్టర్స్ కు చేరుకున్నారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తనను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ తాతా మధు పార్టీ నాయకులను ఉద్దేశించి చెప్పడం కనిపించింది. స్పీకర్ ను ఉద్దేశించి ఏకవచనంతో సంబోధించడం, కఠినపదజాలాన్ని ప్రయోగించడమే ఆయన అరెస్ట్ కు దారి తీసింది. ఆయన చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ ప్రసాద్ కుమార్ కన్నీరు సైతం పెట్టుకున్నారు. ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అమర్యాదకరంగా మాట్లాడటాన్ని తప్పుబట్టారు. శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చెయ్యాలనీ మంత్రులు పట్టుబట్టారు.

# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడిపై చర్యలేవి?



మొదటిపేజీ తరువాయి..

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురించి మాట్లాడుతూ.. మీరంటే నాకు చాలా గౌరవం, చాలా ఇష్టం. చాలా ఏళ్ల నుంచి సభలో మీతో కలిసి పనిచేశాం. ఎమ్మెల్సీ తాతా మధు తాను స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ మీరు మిమ్మల్ని అన్నారని భావిస్తే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానంటూ విచారం వ్యక్తం చేశారు. మీ ప్రభుత్వానికి నిజంగానే ఎస్సీ, ఎస్టీలపై చిత్తశుద్ధి ఉంటే డిక్లరేషన్ ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయకుండా తాళం ఎందుకు వేశారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. మహిళా ప్రజాప్రతినిధులను ప్రభుత్వం గౌరవిస్తుంది. సభాధ్యక్షుడిగా నాకు కూడా గౌరవం ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అయితే మహిళా ఎమ్మెల్యేలపై కేసులు పెట్టారని హరీష్ రావు ప్రస్తావించగా.. మీరు చెప్పింది మేం విన్నాం. మేం చెప్పింది కూడా వినండి. హరీష్ రావు మీకు కాదు, నాకు ఉండాలి ఆవేశం. వాళ్లు అన్నది నీ తల్లిని కాదు, నా తల్లిని అవమానించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీలు నాకు సోదరిమణుల్లాంటి వారు. వారిపట్ల నాకు గౌరవం ఉంది. నా తల్లిని మాటలు అన్నారు, అనుచిత వ్యాఖ్యలు చేశారు దీనికి ఏం సమాధానం చెబుతావు హరీష్ రావు అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభలో గట్టిగానే ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద సోమవారం నాడు సభ్యుల తీరుపై మంత్రి సీతక్క అసెంబ్లీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పాల్సిన అవసరమేంటని, స్పీకర్‌ను, ఆయన తల్లిని దూషించడం కరెక్టేనా అని నిలదీశారు. పోలీసులపై దాడి చేసిన, స్పీకర్‌ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో రూల్స్ తెచ్చిన నేతలే వాటిని ఉల్లంఘిస్తూ అసభ్యకర భాషతో మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అయితే, తమ చీరలు లాగి కొట్టారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. నిజంగా దాడి జరిగితే విచారించి బాధ్యులైన పోలీసులపై కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని సీతక్క స్పష్టం చేశారు.

# త్వరలో 24 గంటలూ బస్ సర్వీసులు




మొదటిపేజీ తరువాయి..

అనుకూలంగా బస్సు సర్వీసులు అందుబాటులో లేవని ఆందోళన వ్యక్తం అవుతున్న తరుణంలో ఇటీవల సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం రాత్రి పూట కూడా బస్సు సర్వీసులను ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రత్యేక బస్ సర్వీసులకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని కొత్త రూట్లలో రాత్రిపూట బస్సు సర్వీసులు ప్రారంభించాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రధాన మార్గాల్లో థర్డ్ షిఫ్ట్ సర్వీసులను విస్తరిస్తామని ఈ మేరకు మంత్రి వెల్లడించారు. రాత్రిపూట అందుబాటులో ఉన్న సర్వీసుల వివరాలు చూస్తే.. అబిడ్స్, లక్డికాపూల్, కేర్ హాస్పిటల్, అన్నపూర్ణ, ఉషాకిరణ్, గుట్లబేగంపేట్, కొండాపూర్ క్రాస్ రోడ్, హఫీజ్‌పేట్, లింగంపల్లి, రామచంద్రాపురం, బీరంగుడి మీదుగా పటాన్‌చెరు వరకు సర్వీసులు. 4 బస్సులు – 16 ట్రిప్పులు – 45 నిమిషాల ఫ్రీక్వెన్సీ.. ప్యారడైజ్, తాడ్ బండ్, బోయిన్ పల్లి, బాలానగర్ క్రాస్ రోడ్, ×ఐూా, ప్రశాంత్ నగర్, కూకట్ పల్లి, ఖూఎదీ, హైదర్ నగర్, గంగారం, లింగంపల్లి, రామచంద్రాపురం మీదుగా పటాన్ చెరు వరకు సర్వీసులు. 2 బస్సులు – 8 ట్రిప్పులు – 75 నిమిషాల ఫ్రీక్వెన్సీ..

ఇంకా పలు రూట్లలో నడపనున్నారు. మరోవైపు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ రాత్రిపూట సర్వీసుల్లో కేవలం ఏడు రోజుల్లోనే 9,286 మంది ప్రయాణికులు ప్రయాణించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్ధరాత్రి వేళల్లో కూడా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి రావడంతో హైదరాబాద్ మహానగర ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని రూట్లలో థర్డ్ షిఫ్ట్ సేవలు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసి, హైదరాబాద్ నగరంలో 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థను దశలవారీగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టం చేశారు.

# హర్మూజ్‌లో మరోసారి రణరంగం..



మొదటిపేజీ తరువాయి..

నౌకలు తీవ్రంగా దెబ్బతిని, ప్రాంతాన్ని విడిచి వెళ్లాయని ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి దాడులకు ప్రతిదాడిగా అమెరికా సెంట్రల్ కమాండ్ తీవ్రస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ ప్రధాన చమురు ఎగుమతి కేంద్రమైన 'ఖార్గ్ ద్వీపం' సమీపంలోని నౌకతో సహా మొత్తం మూడు ఇరాన్ చమురు రవాణా నౌకలను అమెరికా దళాలు ధ్వంసం చేశాయి. అమెరికా సెంట్రల్ కమాండ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఇరాన్‌కు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. "మీరు మా రెండు నౌకలపై కాల్పులు జరిపితే, మేము మీ మూడు నౌకలను ధ్వంసం చేసి, ఊహించని ఆర్థిక నష్టాన్ని చేశామని" అని ఆయన అన్నారు. ఈ ఘటనల్లో అమెరికన్ సిబ్బందికి ఎలాంటి హాని జరగలేదని స్పష్టం చేశారు. అమెరికా దాడుల అనంతరం ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ వేదికగా ఐఆర్‌జీసీ కీలక హెచ్చరికలు చేసింది. ఉగ్రవాద అమెరికా సైన్యం మాటలు నమ్మి అనధికారికంగా హర్మూజ్ మార్గంలో అనుమానాస్పదంగా ప్రయాణించే నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. ఖార్గ్ ఓడరేవు వద్ద తమ ట్యాంకర్‌పై అమెరికా నాలుగు క్షిపణులను ప్రయోగించినప్పటికీ, సిబ్బంది సురక్షితంగా ఉన్నారని ఇరాన్ వార్తా సంస్థ తస్నీమ్ తెలిపింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన అమెరికా సైనిక ఘర్షణల్లో ఇరాన్ చమురు ఎగుమతులకు కేంద్రమైన 'ఖార్గ్ ద్వీపం' ఇప్పుడు వివాదాస్పద ప్రాంతంగా మారింది. యుద్ధానికి ముందు ఇరాన్ తన 90% ముడి చమురును ఈ ద్వీపం ద్వారానే ఎగుమతి చేసేది. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచేందుకు ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలు, సైనిక చర్యల వ్యూహాలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

మరోవైపు ప్రపంచ చమురు సరఫరాలో ఐదో వంతు జరిగే హర్మూజ్ జలసంధిలో యుద్ధ వాతావరణం నెలకొనడంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి. దాడుల కారణంగా బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర బ్యారెల్‌కు 96.28 డాలర్లకు చేరి, ఆందోళన కలిగిస్తోంది.

# భూసేకరణ ప్రక్రియ వేగవం తం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 8, (ప్రజా జ్యోతి ) విమానాశ్రయం నిర్మాణ ప్రక్రి యలో భాగంగా అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను అ త్యంత వేగవంతం చేయాల ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కా ర్యాలయంలో విమానాశ్ర యం నిర్మాణ ప్రక్రియపై ని ర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయ న అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.ఈ సం దర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ,





ఎయిర్‌పోర్ట్ నిర్మాణ ప్రక్రియ, విస్తరణలో భాగం గా భూములు కోల్పోతున్న బాధితులకు సంబంధించిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రక్రి యను తక్షణమే పూర్తి చే యాలని స్పష్టం చేశారు. ని ర్దేశిత గడువులోగా రైతులు, గ్రామస్థులతో మాట్లాడి, భూ సేకరణకు సంబంధించి రేట్ల ను ఫైనలైజ్ చేసి తదుపరి ప్రక్రియను ముందుకు తీసు కెళ్లాలని సూచించారు. ఆ యా సర్వే నంబర్లకు సంబం ధించిన పెండింగ్ దస్తావేజు లను త్వరిత గతిన పరిష్క రించి, అవసరమైన అదన పు ఎక్సెంప్షన్ ప్రపోజల్స్ ప్ర భుత్వానికి పంపాలని అధి కారులను ఆదేశించారు. రె వెన్యూ, సర్వే, ఇతర సంబం ధిత శాఖల అధికారులు స మన్వయంతో పనిచేసి నిర్దే శిత లక్ష్యాలను గడువులో గా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలె క్టర్లు ఆర్.ఎస్.చిత్రూ, ఎస్. రాజేశ్వర్, డిప్యూటి కలెక్టర్ వంశీ కృష్ణ, ఆర్డీవో జగదీశ్వ ర్ రావు, భూ సర్వే కొలతల శాఖ ఏడి ప్రభాకర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికా రులు, సిబ్బంది, తదితరు లు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ కు చేరుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి

ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 8, ( ప్రజా జ్యోతి ): తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి జిల్లా పర్య టన నిమిత్తం స్థానిక పెను గంగ భవన్‌కు చేరుకున్నా రు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్



రాజర్షి షా పుష్ప గు చ్ఛం అందించి సాదర స్వా గతం పలికారు. జిల్లా పర్య టనలో భాగంగా సీఈఓ సు దర్శన్ రెడ్డి ఎన్నికల సన్నా హకాలు, ఓటర్ల జాబితా ప్ర త్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల ఏ ర్పాటు, ఈవీఎంల భద్రత, ఇతర ఎన్నికల నిర్వహణ అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వ హించనున్నారు.ఈకార్య క్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్ తదితరులు పా ల్గొన్నారు.

# పేద కుటుంబాలకు ఇందిర మ్మ కుటుంబ జీవిత భీమా పథకం

## నవంబర్ 19 లోపు దరఖా స్తుల స్వీకరణ పూర్తి చేయా లి

## తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్

ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 08, (ప్రజా జ్యోతి) ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు విధి విధానాలపై రాష్ట్ర ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గౌర వ్ ఉప్పల్ మంగళవారం జి ల్లా కలెక్టర్లతో వీడియో కా న్ఫరెన్స్ నిర్వహించారు. రా ష్ట్రంలోని ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తుల స్వీకర ణ, ఆన్‌లైన్



నమోదు, అర్హు ల గుర్తింపు ప్రక్రియపై కలెక్టర్ల అభిప్రాయాలను సేకరించా రు.ఈ పథకం కింద 18–59 ఏళ్ల కుటుంబ పెద్దకు రూ.5 లక్షల ఉచిత జీవిత బీమా కల్పించను న్నారు. కుటుంబ పెద్ద మరణిస్తే నామినీకి రూ .5 లక్షలు అందేలా పథకా న్ని అమలు చేయనున్నారు. నవంబర్ 19లోపు దరఖా స్తుల స్వీకరణ, ఆన్‌లైన్ ప్ర క్రియ పూర్తి చేయాలని సూ చించారు. ఈ వీడియో కా న్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రా జర్షి షా, అదనపు కలెక్టర్ రా జేశ్వర్, సబ్ కలెక్టర్ కె. ప్రణ య్ కుమార్ పాల్గొన్నారు.

# తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో దోషికి ఉరిశిక్ష

తిరునల్వేలి,సెప్టెంబర్8(ప్రజాజ్యోతి): మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు ఓ ప్రార్థనా స్థలంలో విలాతికుళానికి చెందిన పెయింటర్ మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నాక వారిద్దరూ సుమారు రెండు వారాల పాటు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన మునీశ్వరన్, సదరు బాలికను తన ద్విచక్ర వాహనంపై మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం మునీశ్వరన్ తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, వారు కూడా బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ దారుణం గురించి బాధితురాలు తన తల్లిదండ్రులకు తెలపడంతో, వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు చిన్నకుట్టికి మరణశిక్ష విధించగా, మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967